తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# ప్రాణం తీసిన కడుపు తీపి

**- కూతురి మృతితో తండ్రి మనస్తాపం**
**- రైలు పట్టాలపై విగతజీవిగా మారిన వైనం**


జయకుమార్, లెహన్సిక (ఫైల్‌ఫోటో)

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త: కూతురు అంటే ప్రాణం, ఆ కూతురే ఆత్మహత్య చేసుకుని మృతిచెందింది. ఆ బాధను భరించలేక ఆ కన్న తండ్రి మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకుని రైలుపట్టాలపై విగతజీవిగా మారిన కన్నీటి ఉదంతం పలువురిని కలచివేసింది. వివరాలిలా ఉన్నాయి. సూళ్లూరుపేటలోని రాఘవయ్యపేట పెద్దమసీదు వద్ద నివసిస్తున్న శామ్యూల్ జయ కుమార్‌కు, లెహన్సిక అనే కుమార్తె ఉండేది. కాగా, లెహన్సిక గూడూరులోని ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతుండేది. ఈ నేపథ్యంలో కుమార్తె వివాహం చేసేందుకు జనవరి 31వ తేదీ ముహూర్తం నిర్ణయించి శుభలేఖలను జయకుమార్ పంచిపెట్టారు. లెహన్సిక జనవరి 21వ తేదీ కాలేజీకి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో జయకుమార్ తన కుమార్తె కనిపించడం లేదని సూళ్లూరుపేట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం జనవరి 30వ తేదీ గూడూరు సమీపంలోని పంబలేరు నదిలో లెహన్సిక ఆత్మహత్య చేసుకొని మృతిచెందింది. అప్పటి నుంచి అల్లారుముద్దుగా పెంచుకున్న తన కుమార్తె ఇక లేదని తెలుసుకుని మనస్తాపంతో జయకుమార్ కన్నీరు మున్నీరుగా విలపిస్తూ వచ్చారు. కాగా, గురువారం అర్ధరాత్రి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ కన్నీటి ఉదంతం సూళ్లూరుపేట పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. కడుపు తీపి ఓ కన్నతండ్రి ప్రాణాన్ని తీసిందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. మృతదేహాన్ని రైల్వే పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సిఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు : ఎస్పీ

**- లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ - సిఎం కార్యక్రమాల సమన్వయకర్త వెంకటేష్ ప్రభుత్వ విప్ డాక్టర్ విఎం థామస్, కలెక్టర్, ఎస్పీలతో కలిసి పరిశీలన**


సిఎం పర్యటనకు పక్కా బందోబస్తు ఏర్పాటుకు పోలీసులకు దిశా నిర్ధేశం చేస్తున్న ఎస్పీ


ఏర్పాట్లను కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్‌లతో కలిసి పర్యవేక్షిస్తున్న పి.వెంకటేష్

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శనివారం గంగాధరనెల్లూరు పర్యటనకు రానున్న నేపథ్యంలో పోలీసు శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసిందని ఎస్పీ మణికంఠ చందోలు పేర్కొన్నారు. సిఎం చంద్రబాబునాయుడు గంగాధరనెల్లూరు పర్యటన పురస్కరించుకుని శుక్రవారం ఎస్పీ మణికంఠ చందోలు సిఎం పర్యటించే ప్రదేశాలను పరిశీలించి పోలీసు అధికారులకు సూచనలు చేశారు. కాన్వాయ్ ట్రయల్ రన్‌లో భాగంగా హెలిప్యాడ్ నుండి సభా స్థలం వరకు ఎస్పీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సిఎం పర్యటన పక్కాగా పూర్తి చేయడానికి 600 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో భద్రతా చర్యలు తీసుకుంటున్నా మన్నారు. సిఎం పర్యటనలో భాగంగా ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా కొన్ని నిర్ధేశించిన ప్రాంతాల్లో మాత్రమే ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టాలని పోలీసు అధికారులకు ఎస్పీ స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరు కేటాయించిన విధులను పక్కాగా నిర్వర్తించాలన్నారు. సిఎం తన పర్యటన ముగించుకుని తిరిగి బయలుదేరే వరకు పోలీసులు ఎలాంటి ఆలసత్వం వహించకుండా విధులు నిర్వర్తించాలన్నారు. సిఎం కాన్వాయ్‌లో వున్న సిబ్బంది అత్యంత జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలని, సభా స్థలం, హెలిప్యాడ్ వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని, అధికారులు, ముఖ్య నాయకులు, ఇతరుల వాహనాలకు పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలని, ఎక్కడా ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా పక్కాగా ఏర్పాట్లు చేపట్టాలని ఎస్పీ మణికంఠ చందోలు పోలీసు అధికారులను ఆదేశించారు.

**నేడు జిడి నెల్లూరుకు సిఎం:**

జిల్లాలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లను లబ్దిదారులకు పంపిణీ చేయడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం గంగాధరనెల్లూరుకు వస్తున్నారు. జిడినెల్లూరు హరిజనవాడ పెన్షన్ లబ్దిదారులకు సిఎం చంద్రబాబునాయుడు ఇంటి వద్దకే వెళ్ళి పెన్షన్లు అందించనున్నారు. ముఖ్యమంత్రి శనివారం ఉదయం 11.50 గంటలకు జిడినెల్లూరు మండలం రామానాయుడుపల్లి గ్రామం వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ చేరుకుంటారు. హెలిప్యాడ్ ఆవరణలో సిఎంకు ప్రజాప్రతినిధులు, అధికారులు స్వాగతం పలుకుతారు. సిఎం అక్కడే మధ్యాహ్నం 12గంటల నుండి 12.20గంటల వరకు ప్రజాప్రతినిధులతో సమావేశం అవుతారు. మధ్యాహ్నం 1 గంటలకు సిఎం నారా చంద్రబాబునాయుడు గంగాధరనెల్లూరు చేరుకుని మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ లబ్దిదారుల ఇంటి వద్దకు వెళ్ళి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను లబ్దిదారులకు అందజేస్తారు. అనతరం సిఎం మధ్యాహ్నం 1.30 గంటల నుండి 1.55 గంటల వరకు పది సూత్రాలు అంశంపై వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్ పరిశీలిస్తారు. అక్కడి నుండి మధ్యాహ్నం 1.55 గంటల నుండి మధ్యాహ్నం 2.55 గంటల వరకు గ్రామస్తులతో ప్రజావేదిక కార్యక్రమం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు సిఎం రామానాయుడు పల్లి చేరుకుని స్థానిక ప్రజా ప్రతినిధులతో సమావేశంలో పాల్గొంటారు. ఆపై మధ్యాహ్నం 3.30 గంటలకు హెలిప్యాడ్ చేరుకుని అక్కడి నుండి తిరుపతి తిరుగు ప్రయాణం అవుతారు.

**సిఎం పర్యటనకు పక్కా ఏర్పాట్లు:**

జిల్లాలోని గంగాధరనెల్లూరు మండలంలో శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటించి లబ్దిదారులకు సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించి సిఎం పర్యటన ఏర్పాట్లను శుక్రవారం ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పి.వెంకటేష్ ప్రభుత్వ విప్, జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్, కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ చందోలుతో కలిసి పరిశీలించి అధికారులకు దిశా నిర్ధేశం చేశారు. సిఎం పర్యటన విజయవంతం చేయడానికి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లతో పాటు ఎక్కడ ఎలాంటి పొరబాట్లకు తావు లేకుండా ఎవరికి కేటాయించిన విధులను వారు సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. ఆపై కాన్వాయ్ నిర్వహణ, ప్రజా వేదిక, సంబంధిత అంశాలపై సిఎం కార్యక్రమాల సమన్వయకర్త ప్రభుత్వ విప్, జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్, కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ చందోలుతో కలిసి చర్చించారు. ఈ ఏర్పాట్ల పరిశీలనలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో పాటు జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, కడ పిడి వికాస్ మర్మత్, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, అడిషనల్ ఎస్పీ శివానందకిషోర్, డిటిసి నిరంజన్‌రెడ్డి, డిఆర్‌డిఎ పిడి శ్రీదేవి, చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు, పలమనేరు ఆర్డీఓ భవానీ, ఎపిఎస్‌పిడిసిఎల్ ఎస్ఇ ఇస్మాయిల్, డిఎస్‌ఓ శంకరన్, చిత్తూరు డిఎస్పీ సాయినాథ్, ఇతర సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## మునిసిపాలిటీలో నిధుల...
# దుర్వినియోగంపై విచారణ

**అసెంబ్లీలో ప్రశ్నించిన ఎమ్మెల్యే భాను**




పుత్తూరు, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త : పుత్తూరు మునిసిపాలిటీలో గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2019 నుంచి 2024 సంవత్సరం వరకూ పుత్తూరు మునిస్పిలిటీలో ప్రభుత్వ నిధుల వ్యయంలో తీవ్ర అవకతవకలు జరిగాయి. ఈ విషయాన్ని ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ అసెంబ్లీలో ప్రస్తావించారు. దాంతో విచారణ నిర్వహించి నివేదిక ఇవ్వాలని మునిసిపల్ పరిపాలనా శాఖ డైరక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఆ మేరకు మునిసిపల్ పరిపాలనా శాఖ అనంతపురం రీజనల్ డైరక్టర్ పి.విశ్వనాథ ఆధ్వర్యంలో ఆరుగురు సభ్యులతో ఒక విచారణ కమిటీని నియమించారు. హిందుపూర్ మునిసిపాలిటీ నుంచి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు మోహన్, తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ ఇంజనీరు పవన్ కుమార్ రెడ్డి, మదనపల్లి మునిసిపాలిటీ పరిపాలనా అధికారి ప్రకాశ్, సీనియర్ అసిస్టెంట్ జె.వినోద్ ప్రీతమ్, ఆదోని మునిసిపాలిటీ నుంచి రెవెన్యూ అధికారి కె.ఎండి.నాజర్ హుస్సేన్, చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ సీనియర్ అసిస్టెంట్ ఎస్.ఉమామహేశ్వర రెడ్డిలను విచారణ కమిటీలో సభ్యులుగా ప్రభుత్వం నియమించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం పుత్తూరు మునిసిపాలిటీ కార్యాలయంలో కమిటీ విచారణ ప్రారంభించింది. ముఖ్యంగా మునిసిపాలిటీ పరిధిలోని సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ కట్ట కొద్ది మేరకు కుంగింది. ఈ కట్టను తిరిగి బలోపేతం చేసేందుకు అప్పట్లో మునిసిపాలిటీ సాధారణ నిధుల నుంచి రూ. 40 లక్షల రూపాయల వరకూ వ్యయం చేశారు. అయితే కట్టను పునరుద్ద రించేందుకు రూ. 5 లక్షలు కూడా ఖర్చు కాలేదని, కట్ట నిర్మాణం పేరుతో అధికారులు, వైసిపి ప్రజా ప్రతినిధులు కలిసి ప్రజల సొమ్ము స్వాహా చేశారని ఆరోపణలు వచ్చాయి. ఈ ఆరోపణలపై టిడిపికి చెందిన కౌన్సిలర్లు మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడడానికి ప్రయత్నించగా వైసిపి కౌన్సిలర్లు మాటలతో మూకుమ్మడిగా వారిపై దాడి చేశారు. దాంతో ఆరోపణల్లో వున్న నిజం బయటపడలేదు. దీంతో పాటు తరచూ విద్యుత్ మోటార్ల మరమ్మతులు, కాల్వల్లో పూడిక తీత, వీధి లైట్ల నిర్వహనలో పెద్ద ఎత్తున నిధులు దుర్వినియోగమయ్యాయి. మునిసిపల్ నూతన కార్యాలయ భవన నిర్మాణంలో కూడా రివైజ్డ్ అంచనాలు లేకుండా ఇష్టానుసారం నిధులు వ్యయం చేసి ప్రజలు ఆస్తి పన్ను రూపేణా చెల్లించిన సాధారణ నిధులను స్వాహా చేశారని ఆరోపణలు వున్నాయి. విచారణ కమిటీ ఈ అంశాలపై ప్రధానంగా దృష్టి పెడుతోంది. అసెంబ్లీలో ప్రస్తావించినందున విచారణ పారదర్శకంగా జరిగే అవకాశాలు వున్నట్టు తెలుస్తోంది.

## భోళాశంకరుని కళ్యాణానికి...
# ముస్తాబై దక్షిణ కైలాసం

**అంబారిపై వరుడుగా ఆదిదేవుడు**
**-సింహంపై వధువుగా అమ్మవారు-శ్రీకాళహస్తిలో పెళ్లికళ**

(శ్రీకాళహస్తి, ప్రభాతవార్త)


సింహవాహనంపై అమ్మవారు, గజవాహనంపై స్వామివారు


ముస్తాబైన పెండ్లిమండపం దృశ్యం

ముల్లోకాల్ని ఏలే ముక్కంటీశుని కళ్యాణోత్సవం కన్నుల పండువగా అంగరంగ వైభవంగా సోమవారం రాత్రి ప్రారంభమైంది. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో స్వామి అమ్మవార్ల కళ్యాణ వేడుకలు ప్రారంభమయ్యాయి. వేకువ జామున జరిగే వివాహానికి స్వామి అమ్మవార్లు ముస్తాబై ఆలయం నుంచి బయలు దేరారు. ముక్కోటి దేవతలు సాక్షిగా పంచభూతాల ఆశీర్వచనాలతో ఆదిదేవుడు,పార్వతీ దేవిల కళ్యాణం కమనీయంగా ప్రారంభమైంది.. స్వామి అమ్మవార్ల కళ్యాణంతో పాటు వివాహాలు జరుపుకునే కొత్త దంపతులకు ప్రత్యేకంగా దేవస్థానం ఏర్పాట్లు చేపట్టారు. హిందూ వివాహ వ్యవస్థను భావి తరాలకు తెలియజేసే విధంగా ఏర్పాట్లు జరిగాయి. శాసనసభ్యుడు బొజ్జ సుధీర్‌రెడ్డి సూచనలతో ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి సారధ్యంలో ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా కార్యక్రమాలు రూపొందించారు. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత ప్రారంభమైన స్వామి అమ్మవార్ల కళ్యాణోత్సవ శోభామానంగా సాగింది.

**కళ్యాణం కమనీయం...**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం వేకువ జాము 4గంటలకు నిర్వహించే స్వామి అమ్మవార్ల కళ్యాణోత్స వానికి సర్వం సిద్దంచేశారు. ఆది దంపతుల్ని వధూవరులుగా ముస్తాబుచేశారు. రాత్రి ఆలయంలోని అలంకార మండపంలో శ్రీకాళహస్తీశ్వరుని వరునిగా, దేవేరి జ్ఞానప్రసూనాంబ అమ్మవారిని వధువుగా ముస్తాబుచేసి ఆలయంలోని నాలుగు వైపులా ఉత్సవం నిర్వహించారు. యాగశాల వద్ద కవ వ్ం తీసి ప్రధానార్చకులు డాక్టర్ స్వామినాధన్ చుక్కలు పెట్టి ఊరేగింపుకు పంపారు. కళ్యాణోత్సవం సందర్భంగా నాలుగుమాడావీధులు, సన్నిధివీధిలోని విద్యుత్ స్తంభాలకు మామిడితోరణాలు, అరటి చెట్లతో శోభాయమానంగా తీర్చిదిద్దారు.

**అంబారిపై వరుడు... సింహాంపై వధువు**

అంబారిపై స్వామి, సింహవాహనంపై అమ్మవార్లు నాటి రాజులు అందించిన ఏడు వారాల నగల్లో చూడటానికి వేయికళ్ళు చాలవన్నట్లు ముస్తాబు చేశారు. కళ్యాణోత్సవానికి కదలిన ఆదిదంపతులకు ఏర్పాట్లను ఆలయ అధికారులు పర్యవేక్షించారు. ఆలయానికి సంబంధించి జెండా వెళుతుండగా వెనుక గొడుగులు, ఆతర్వాత నంది, సాంస్కృతిక బృందాల, కోలాటాలు, కీలు గుర్రాలు, విచిత్ర వేష ధారణలు, కేరళ వాయిద్యాలు కనువిందు చేశాయి. ఎలుకవాహనంపై వినాయకుడు, నెమలి వాహనంపై సుబ్రమణ్యస్వామి, ముందు వెనుక చండికేశ్వరుడు, భక్తకన్నప్ప వెంటరాగా శివపార్వతులు కళా ్యణోత్సవానికి బయలుదేరారు. స్వామిఅమ్మవార్ల కళ్యాణోత్సవానికి దేవస్థానం అన్ని ఏర్పాట్లు చేసింది. పట్టణంలోని నాలుగుమాడావీధులను శుభ్రంచేసి రోడ్డుపై నీళ్లుచల్లారు. పెండ్లి మండపం సమీపంలోని నగరివీధిలో మామిడితోరణాలు,సంప్రదాయ బద్దంగా ముగ్గులు, అరటిచెట్లతో ముస్తాబుచేశారు. దీంతో శ్రీకాళహస్తికి పెళ్లికళ వచ్చేసింది. శ్రీకాళహస్తి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో స్వామిఅమ ్మవార్ల కళ్యాణోత్సవం అంటే ఎంత సంబరంగా పల్లెల్లో నుంచి జనం వచ్చారు. అయితే గత ఐదారేళ్లుగా బాల్యవివాహాలంటూ రెవెన్యూ, పోలీసు శాఖలు విధినిర్వహణలో తమ బాధ్యతల్ని నెరవేర్చారు.

# గజ, కామధేను వాహనాలపై విహరించిన మొగిలీశ్వరుడు



బంగారుపాళ్యం, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం గజ వాహనంపై మొగిలీశ్వరుడు విహరించాడు. అందుకు ముందు ఆలయ అర్చకులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేక పూజలు చేపట్టారు. వివిధ పుష్పాలతో అలంకరించిన గజ వాహనంపై ఉత్సవమూర్తులను వుంచి ఆలయ పుర వీధుల్లో ఊరేగింపు చేశారు. ఈ ఉత్సవానికి ఉభయ దారులుగా మొగిలివారిపల్లికి చెందిన వసంతమ్మ, నందా, గాంధీ కుటుంబ సభ్యులు వ్యవహరించారు. శుక్రవారం రాత్రి కామధేనువు వాహనంపై మొగిలీశ్వరుడు ఊరేగారు. వివిధ పుష్పాలు, విద్యుత్ దీపాలతో అలంకరించిన కామధేనువు వాహనంపై స్వామి, అమ్మవార్లను వుంచి మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపు చేపట్టారు. ఈ ఉత్సవానికి నాయి బ్రహ్మణ సంఘం, పరిసర గ్రామస్తులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త విజయకుమార్, ఇఓ మునిరాజులు పాల్గొన్నారు.

## శాస్త్రవేత్తల సేవలు దేశానికి...
# ఎంతో అవసరం : జిల్లా కలెక్టర్


ఐసర్ విద్యాసంసల విద్యార్థులతో జిల్లా కలెక్టర్

శ్రీకాళహస్తిరూరల్,ఫిబ్రవరి 28 ప్రభాతవార్త : శాస్త్రవేత్తలు,వారి సేవలు దేశానికి ఎంతో ముఖ్యమని వెలకట్టలేనివని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్ శుక్రవారం కేంద్ర విద్యాసంస్థ ఐసర్‌లో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా పిలుపు నిచ్చారు.ఐసర్ జాతీయ 10 వదినోత్సవం సందర్భంగా ఐసర్ విద్యార్థులు ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు కలెక్టర్ ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఐసర్ డైరెక్టర్ సంతన్ భట్టాచార్యలతో కలసి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వికసిత్ భారత్ సాధనదిశగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని కలెక్టర్ పిలుపు నిచ్చారు.శాస్త్రవేత్తలు దేశాన్ని ముందుకు తీసుకెళ్ళటానికి శాస్త్ర సాంకేతిక రంగాల్లో కృషి చేస్తున్నారని వివరించారు. అందరం కలసి దేశాన్ని,రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడపటానికి కృషి చేయాలన్నారు. ప్రపంచం మొత్తం గుర్తుపెట్టుకునే శాస్త్రవేత్త సివి రామన్ అన్నారు. తాను8వ తరగతిలో ఖగోళ శాస్త్రవేత్త కావాలని కోరుకున్నానని తెలిపారు. సైన్స్ ఎంతో ఆసక్తికరమై అంశం అన్నారు.ఈఅత్యున్నత విద్యాసంస్థ నందుచదువుకుంటున్న ప్రతి విద్యార్థి విద్యార్తులు ప్రతి ఒక్కరు అంకిత భావంతో తమ విద్యను అభ్యసించాలని పిలుపు నిచ్చారు. డైరెక్టర్ భట్టాచార్య సారథ్యంలో కలెక్టర్ తన బాల్య జ్ఞాపకాలను పంచుకున్నారు.ఆకాశంలో నక్షత్రాలు రాసులను చూసి ఆనందించే వారని ఆస్ట్రో రిజిస్ట్రి కావాలని కలలు కన్నానన్నారు.కానీ ఎంబిబియస్ పట్టా పొందానన్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పని చేసానని తరువాత ఐఏయస్ అయ్యానన్నారు. ఈ సైన్స్ ప్రదర్శనను వేదాంత పురం,ఏర్పేడు, తిరుపతి, శ్రీకాళహస్తి, శ్రీ సిటి వంటి వివిధ ప్రాంతాలనుంచి విద్యార్థులు సైన్స్ స్టాల్స్‌ను ప్రదర్శించారు.ఈ కార్యక్రమాల్లో ఐసర్ ఫ్యాకల్టీ పలువురు విద్యార్థి విద్యార్థులు అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## అధికారనంది-కామధేనువు వాహనాలపై ...
# ముక్కంటీశుడు, జ్ఞానప్రసూనాంబ

(శ్రీకాళహస్తి-ప్రభాతవార్త)


అధికార నందిపై స్వామి,కామధేనుపై అమ్మవారు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం భోళా శంకరుడు అధికార నందివాహనంపై, అమ్మవారు కామధేను వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. గురు వారం రాత్రి తెప్పోత్సవం ఘనంగా నిర్వహించిన అధికారులు సోమవారం అధికార నంది,కామధేను వాహనాలపై ప్రతిష్టించి ఉత్సవం జరిపారు. త్రినేత్రుని ఎంతో చక్కగా అలంకరించారు. శాస్త్రోక్తంగా మేళతాళాలు మంగళవాయిద్యాలతో శివయ్యగోపురం గుండా స్వామి అమ్మ వార్లను వాహనాల మండపం వద్దకు తెచ్చారు.దివ్యాలంకార భూషితురాలైన అమ్మ వారిని కామధేను వాహనంపై ప్రతిష్టించి భక్తులకు దర్శనం కల్పించారు. మండుటెండలో వాహన సేవ సాగింది. అయితే ముందుగా దేవస్థానం ట్యాంకర్‌తో రోడ్లమీద నీటిని చల్లుకుంటూ ముందుకు సాగారు.ఉత్సవాల్లో ఏడవ రోజు స్వామి అమ్మవార్లను అలంకార మండపంలో రాజేష్ గురుకుల్, సురేష్‌గురుకులు, ఎంతో చక్కగా అలంకరించారు. ఉత్సవానికి ముందు వివిధ నాట్యబృందాలు, కోలాటాలు, గెరిగే, పంచవాయిద్యాలు, బ్యాండు మేళాలు వెళు తుండగా బాణసంచాంను కాలుస్తూ ముందుకుసాగించారు. పట్టణంలో తన భక్తుల నుంచి నైవేద్యాలు,హారతులందుకుంటూ కైలాసనాధుడు సాగారు. ఉత్సవంలో ఎన్నో టెంపుల్ సూపరిటెండెంట్ లోకేష్‌బాబు, టెంపుల్ ఇన్సెపెక్టర్ హరియాదవ్ దఫేదారు సుబ్బయ్యలు పర్యవేక్షించుకుంటూ సాగించారు.

# సాంకేతిక అభివృద్ధికి శాస్త్రవేత్తలు కృషి చేయాలి



పుత్తూరు, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త : దేశంలో శాస్త్ర, సాంకేతిక రంగాల అభివృద్ధి కోసం సి.వి. రామన్ తన యావత్ జీవితాన్ని త్యాగం చేశారని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఇన్‌ఛార్జ్ ప్రన్సిపల్ వి.వీరయ్య అన్నారు. 1930లో సర్ సి.వి.రామన్‌కు భౌతిక శాస్త్రంలో నోబుల్ బహుమతి లభించిన సందర్భంగా ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28వ తేదీన జాతీయ సైన్స్ దినోత్సవంగా జరుపుకుంటున్నట్టు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కాలేజీలో జరిగిన సైన్స్ దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సైన్స్ ప్రాముఖ్యతను వ్యాప్తి చేయడవమే సైన్స్ దినోత్సవ లక్ష్యమని పేర్కొన్నారు. పలువురు అధ్యాపకులు మాట్లాడుతూ పేదలు, అట్టడుగు వర్గాల అభివృద్ధికి శాస్త్రవేత్తలు కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పద్మావతి, డాక్టర్ శ్యామ్‌సన్ రాజు, డాక్టర్ గాయత్రి, డాక్టర్ వసంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




## రైతులకు కార్డుల నమోదు కార్యక్రమం

**కుప్పంరూరల్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :** మండలంలోని చెక్కునత్తం పంచాయతీ అడవిములకలపల్లి గ్రామంలో శుక్రవారం వివిఎ జయసుధ నిర్వహిం చారు. ఈసందర్భంగా రాష్ట్ర తెలుగుయువత ఆర్గనైజింగ్ కార్యదర్శి చెక్కునత్తం మణి మాట్లాడుతూ రైతులు తమ వివరాలను రిజిస్ట్రీ చేసుకోవాలని అలాంటి రైతులకు పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ వంటి పథకాల్లో లబ్ది కలుగుతుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## టైలర్స్ భవనానికి స్థలం కేటాయించాలి

**పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :** జాతీయ టైలర్స్ దినోత్సవాన్ని పుంగనూరులో శుక్రవారం భారత్ టైలర్స్ అసోసియేషన్ వారు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఎంబీటీ రోడ్డులో కుట్టుమిషన్ రూపకర్త విలియమ్స్ హౌవే చిత్రపటాన్ని ఏర్పాటు చేసి టైలర్స్ నివాళులర్పించారు. తర్వాత పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. సంఘ అధ్యక్షులు



ఖాసీమ్ మాట్లాడుతూ టైలర్స్ అసోసియేషన్ భవనం నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కేటాయించాలని పాలకులకు విన్నవించారు.

## టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి వితరణ



**వి.కోట, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :** మండలంలోని కరిప్పల్లి జడ్పీ హైస్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు స్థానిక ఎండిహెచ్ ఎడ్యుకేషనల్, చారిటబుల్ ట్రస్ట్ అధినేత పవన్ కళ్యాణ్ పరీక్షా సామగ్రిని ఉచితంగా అందించారు. హెచ్ఎం జగన్నాథం, ఉపాధ్యాయులు, సంస్థ సభ్యులు పురుషోత్తం, సిద్ధు పాల్గొన్నారు.

## ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర బడ్జెట్

**శాంతిపురం, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :** సిఎం చంద్రబాబునాయుడు రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టించారని తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. 3.22లక్షల కోట్ల బడ్జెట్ రాష్ట్ర పునర్ని ర్మాణానికి పునాది లాంటిదన్నారు. బడ్జెట్‌లో ఎస్సీ,ఎస్టీ, బిసి, మైనార్టీలు, మహిళలు, వృద్ధుల సంక్షేమంకు నిధులు కేటాయించారన్నారు. గతంలో జగన్ ప్రభుత్వం సంక్షేమం పేరిట నిధులు కేటాయించి వివిధ పథకాలకు నిధులు మళ్లించిందన్నారు. తమ ప్రభుత్వం నిధుల దారి మళ్లింపుకు అవకాశం లేకుండా బడ్జెట్ రూపొందించడం జరిగింద న్నారు.

## పైపులైన్ల ఏర్పాటుకై అధికారుల సర్వే



**శాంతిపురం, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :** కడపజిల్లా గండికోట నుంచి నీటిని కుప్పానికి తరలించేందుకుగాను అధికారులు డిపిఆర్ తయారీకై సర్వే చేపడు తున్నారు. శుక్రవారం మండలంలోని కెనమాకులపల్లిలో అధికారులు పైపులైన్ల ఏర్పాటుకు సర్వే చేపట్టారు. ఈ పనులను మండల టిడిపి అధ్యక్షుడు విశ్వనాథనాయుడు పరిశీలించారు. కార్యక్రమంలో మండల ఎఇ, పంచాయతీ కార్యదర్శి, తెదేపా నేత రమేష్ పాల్గొన్నారు.

## కుప్పంలో పారిశుద్ధ్యంపై పటిష్ట చర్యలు : కమీషనర్

**కుప్పం, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :** కుప్పం మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్యంపై పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి పట్టణంలో చెత్త సేకరించే కార్మికులతో ఆయన సమావేశమయ్యారు. పట్టణంలోని ప్రధాన



రహదారుల్లో ఎక్కడా చెత్త కన్పించకుండా సేకరించాలని ఆదేశించారు. రాత్రి సమయంలో రోడ్లను శుభ్రం చేయాలని అలాగే వ్యర్థాలను సేకరించి డంపింగ్‌యార్డుకు తరలించారన్నారు. ప్రజలు కూడా పట్టణంలో పారిశుద్ధ్యానికి తమవంతు సహకరించాలని కోరారు.

## చట్టం ముందు అందరు సమానం



**పాలసముద్రం, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** రాజ్యాంగంలోని చట్టం ముందు కుల, మతాలకు అతీ తంగా అందరు సమానులేనని తహసిల్దారు అరుణ కుమారి పేర్కొన్నారు. సివిల్ రైట్స్‌డేను పురస్క రించుకుని శుక్రవారం వెంగళరాజుకుప్పం ఇందిరా నగర్ రేణుకా పరమేశ్వరీ ఆలయంలో సమావేశం నిర్వ హించారు. ఈ సమావేశానికి హాజరైన తహ ల్దారు అరుణకుమారి మాట్లాడుతూ పౌరహక్కులు, పౌరుల విధులు, ఆదేశిక సూత్రాలు, న్యాయపరమైన సమస్యలను పరిష్కరిం చుకోవడం తదితరాలను ప్రజలకు వివరించారు. విఆర్ఓలు రమేష్‌నాయుడు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సైన్స్ దినోత్సవం

**బంగారుపాళ్యం, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** జాతీయ సైన్స్ దినోత్సవంను పలు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు సైన్స్ దినోత్సవంను ఎంఇఓ నాగేశ్వరరావు ప్రారంభించారు. టేకుమంద జడ్పీ ఉన్నత పాఠశాల నందు ఎంఇఓ-2 రమేష్ సైన్స్ దినోత్సవంను ప్రారంభించారు. ఇటీవల సౌర కుటుంబంలోని గ్రహాలు ఒకే కక్ష్యలో చేరిన విషయంను రూపొందించిన ప్రదర్శన అందరిని ఆకర్షించింది. ఈ కార్యక్రమంలో



హెచ్ఎం అబ్దుల్ సుభాన్, సైన్స్ టీచర్లు షంషీర్‌ఖాన్, విజయకుమారి, ఉపాధ్యాయులు వేణురెడ్డి, కేశవులు, దేవకి, వెంకటరమణ, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ముస్లీం ఐక్యవేధిక అధ్యక్షుడిగా షేక్ ఫిరోజ్



**బంగారుపాళ్యం, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** జిల్లా ముస్లీం ఐక్య వేదిక అధ్యక్షులుగా బంగారుపాళ్యంకు చెందిన షేక్ ఫిరోజ్ అహ్మద్ నియమితులయ్యారు. ఈయన పూతలపట్టు నియోజకవర్గ ఐక్యవేదిక అధ్యక్షుడిగా పని చేశారు. ఈయన సేవలు గుర్తించినరాష్ట్రకార్యవర్గం షేక్ ఫిరోజ్ అహ్మద్‌ను జిల్లా అధ్యక్షుడిగా నియమించింది.

## స్వర్ణాంధ్ర దిశగా అడుగులు

**గుడిపాల, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** రాష్ట్రం కూటమి పాలనలో స్వర్ణాంధ్ర దిశగా అడుగులు వేస్తోందని ఇందుకు శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 3.24 లక్షల కోట్ల రూపాయల బడ్జెట్ నిదర్శనమని రాష్ట్ర తెలుగుయువత అధికార ప్రతినిధి హేమాద్రినాయుడు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత వైకాపా పాలనలో రాష్ట్రం విధ్వంసం అయ్యిందని, ఉద్యోగులకు జీతాలు సైతం చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు.

## అగస్త్యేశ్వరుని సన్నిధిలో అన్నదానం

**చౌడేపల్లి, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :** ఎ.కొత్తకోట సమీపంలోని అగస్త్యేశ్వరస్వామి సన్నిధిలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహాశివరాత్రిని పురస్కరిం చుకొని కొండపై రథోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విశేష సంఖ్యలో వచ్చిన భక్తులకు యువనేత మిద్దింటి కిషోర్‌బాబు అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేసారు. బోయకొండ మాజీ సభ్యుడు రాజేష్, సురేష్, మిద్దింటి మిత్ర బృందం పాల్గొన్నారు.

## బడ్జెట్‌లో పాఠశాల విద్యకు 20 శాతం నిధులు

**చిత్తూరురూరల్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** ప్రభుత్వ విద్యా రంగం అభివృద్ధికి రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలని కొఠారి కమీషన్ స్పష్టంగా చెప్పినా పట్టించుకోకుండా అసెంబ్లీలో శుక్రవారం ప్రవేశపెట్టిన 2025-26 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో పాఠశాల విద్యకు కేవలం 9.86 శాతం నిధులు కేటాయించడం శోచనీయమని రాష్ట్ర యుటిఎఫ్ కార్యదర్శి జివి రమణ పేర్కొన్నారు. పాఠశాల విద్యకు బడ్జెట్‌లో తక్కువ నిధులు కేటాయించడంతో ప్రభుత్వం విద్యా రంగ బాధ్యతల నుండి తప్పుకొనే భావన ఏర్పడుతుందన్నారు. గత ప్రభుత్వం పాఠశాల విద్యను విచ్ఛిన్నం చేసిందని, ఈ ప్రభుత్వమైనా అభివృద్ధి చేస్తుందని భావించడం జరిగిందన్నారు.

## హామీలు అమలు దిశగా బడ్జెట్ : ఎమ్మెల్యే



**చిత్తూరురూరల్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల అమలు చేసే దిశగా సూపర్ సిక్స్ పథకాలను సకారం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయింపులు చేసిందని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు పేర్కొన్నారు. ప్రస్తుత కూట మి ప్రభుత్వం అమరావతి అభివృద్ధికి 6 వేల కోట్ల రూపాయలు, పోలవరం నిర్మాణానికి 6,705 కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందన్నారు. అలాగే ఎన్నికలహామీలుఅమలుచేయడానికిఅవసరమైననిధులనుబడ్జెట్‌లోకేటాయించడం శుభపరిమాణం అన్నారు.

## హామీల అమలు బడ్జెట్ : సురేంద్రకుమార్



**చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రజల సంక్షేమం, అభివృద్ధితో పాటు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు పరచే విధంగా కూటమి ప్రభుత్వం శుక్రవారం అసెంబ్లీలో ఈ ఆర్థిక సంవత్సరానికి 3,22,359 కోట్ల రూపాయలతో బడ్జెట్ ప్రవేశపెట్టిందని రాష్ట్ర తెలుగుదేశం అధికార ప్రతినిధి వెంకిటీల సురేంద్రకుమార్ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర పునర్నిర్మాణానికి పునాదులు వేసేలా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు చేసేలా బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు.

## జాతీయ పెన్సింగ్ క్రీడాకారులకు ధృవపత్రాలు

**యాదమరి, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** జాతీయ స్థాయి పెన్సింగ్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మీ శుక్రవారం ధృవ పత్రాలను అందజేశారు. యాదమరి జడ్పీ ఉన్నత పాఠశాల పెన్సింగ్ క్రీడా కారులు కమల్ ఫాతిమా, మానస, యుగ భారతిలు ఇటీవల జమ్ము కాశ్మీర్‌లో జరిగిన జాతీయ



పెన్సింగ్ పోటీల్లో పాల్గొని వచ్చారు. జాతీయ పెన్సింగ్ పోటీలకు ప్రాతినిధ్యం వహించిన యాదమరి జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడాకారులను శుక్రవారం పాఠశాల హెడ్మాస్టర్ గిరిరాజా, ఫిజికల్ డైరెక్టర్లు రవి, హరికృష్ణలతో కలిసి జిల్లా విద్యాశాఖ కార్యాలయంలోని డిఇఒ ఛాంబర్‌లో డిఇఒ వరలక్ష్మిని కలిశారు.

## 15గొర్రెలు అపహరణ

**చౌడేపల్లి, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త** గొర్రెలదొడ్డి నుంచి గుర్తు తెలియని వ్యక్తులు 15గొర్రెలను అపహరించుకొని వెళ్ళిన సంఘటన చౌడేపల్లిలో చోటు చేసుకొంది. బాధిత రైతు కథనం మేరకు...మండలంలోని శెట్టిపేట పంచాయతీ తోటకురపల్లికి చెందిన చెంగారెడ్డి గొర్రెల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నాడు. ఈక్రమంలో గొర్రెలను దొడ్డిలో భద్రపరచి వుండగా శుక్రవారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు తనకున్న గొర్రెల్లోంచి 15గొర్రెలను అపహరించుకొని వెళ్ళారని రైతు వాపోయాడు. వాటి విలువ రూ. 1.75లక్షలు చేస్తుందన్నాడు. గంగజాతర్లు సమీపిస్తున్న తరుణంలో చేతికందిన గొర్రెలను దొంగలించారని చెంగారెడ్డి తెలిపాడు. ఈమేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వివరించాడు.

## కూటమి ప్రభుత్వానిది ప్రజా సంక్షేమ బడ్జెట్

**కుప్పం, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :** రాష్ట్ర ఆర్థిక భవిష్యత్తును గాడిన పెట్టేలా సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో మంత్రి పయ్యావుల కేశవ్ ప్రజాసంక్షేమ బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టారని ఎపిఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. శుక్రవార ం స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో ఆయన రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ బిఆర్



సురేష్‌బాబు, పార్టీ కన్వీనర్ ఆర్. చంద్రశేఖర్, పార్టీ మున్సిపల్, మండల అధ్యక్షులు రాజ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, విశ్వనాథ నాయుడులతో కలసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమ ప్రభుత్వం బడ్జెట్ ప్రతిపక్షాలకు సమాధానం అని పేర్కొన్నారు. గత ప్రభుత్వం నిలిపేసిన 73 పథకాలను కూటమి ప్రభుత్వం పునఃప్రారంభించిందన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయరంగానికి తగిన నిధులు కేటాయించడం జరిగిందన్నారు. దావోస్ సదస్సు ఫలితాలు మున్ముందు రానున్నాయన్నారు. సిఎం చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో నేతలు సత్యేంద్రశేఖర్, మహేంద్ర, హేమా ఒబరగౌడు, దివాకర్, సంతోష్, చంద్ర, గిరి తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేషన్ రుణాల కోసం ఎగబడ్డ జనం



**కుప్పం, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం వివిధ కార్పోరేషన్ల పరిధిలో స్వయం ఉపాధి రుణాలను బ్యాంకర్ల ద్వారా అందిస్తోంది. ఈ రుణాలను పొందేందుకు దరఖాస్తు చేసుకున్న జనం ఎగబడ్డారు. కుప్పం మున్సిపల్ కార్యాలయం వద్ద శుక్రవారం మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు అధ్వర్యంలో వివిధ బ్యాంకుల అధికారులు దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మున్సిపల్ పరిధిలో 129యూనిట్లకు గాను సుమారు 1500మంది దాకా దరఖాస్తులు చేసుకోగా ఉదయం నుంచి సాయంత్రం దాకా బ్యాంకర్లు లబ్దిదారుల ఎంపికకై ఇంటర్వ్యూలు జరిపారు. కార్యక్రమాల్లో మున్సిపల్‌ఫ్లోర్ లీడర్ జిమ్‌దాము, కౌన్సిలర్లు జాకీర్, సోమశేఖర్,సురేష్ తదితరులు పాల్గొన్నారు. మరో పక్క కుప్పం మండల కార్యాలయంలో సైతం గ్రామీణ ప్రాంతాల దరఖాస్తుదారులకు రెండోరోజు ఇంటర్వ్యూలు కొనసాగాయి.

## మామిడి రైతులకు యాభైశాతం రాయితీతో కవర్లు

**కుప్పం/శాంతిపురం, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :** కుప్పం, రామకుప్పం, శాంతిపురం, గుడుపల్లె మండలాల్లో మామిడిసాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం యాభైశాతం రాయితీతో కవర్లు అందజేస్తోందని ఉద్యానవన అధికారులు డింపుప్రియశ్రీ, వింధ్య తెలిపారు. ఒక్కో రైతు ఎకరాకు నాలుగువేల కవర్లు, గరిష్టంగా 2.5ఎకరాలకు పదివేల కవర్లు తీసుకోవచ్చన్నారు. కవర్లు అవసరమైన రైతులు వారి ఆధార్, భూమి పాసుపుస్తకం నకళ్లతో పాటు ఒక్కో కవరుకు ఒక రూపాయి చెల్లించాల్సి ఉంటుందన్నారు. రైతులు వివరాలకు 7731881596, 7995086952నెంబర్లను సంప్రదించాలని వారు కోరారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ప్రతి హైస్కూల్లోనూ సైన్స్ డే



**పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :** పట్టణ మండల పరిధిలోని అన్ని పాఠశాలల్లో శుక్రవా రం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిం చారు. పట్టణంలోని బసవరాజు ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ మేళాను ఎంఈఓలు చంద్రశే ఖర్‌రెడ్డి, రెడ్డన్నశెట్టిలు ప్రారంభించారు. బాల బాలికలు సైన్స్ ఆవిష్కరణలు, ప్రయోగాలను ప్రదర్శిం చారు. 9 క్లస్టర్ల పరిధిలో 139 పాఠశాలల్లో సైన్స్ మేళాను నిర్వహించారు.

## రావణ బ్రహ్మావాహనంపై అలరించిన కాళభైరవుడు

**తవణంపల్లె, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** మండల కేంద్రం తవణంపల్లెలో ఎత్తైన కొండపై వెలసిన శ్రీకాళభైరేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న మహాశివరాత్రి వేడుకలలో భాగంగా శుక్రవారం కాళభైరవుడు రావణ బ్రహ్మావాహనంపై ఊరేగుతూ భక్తులకు అభయ హస్తమిచ్చారు. ఈకార్యక్రమానికి తవణంపల్లెకు చెందిన వన్నియకుల వంశస్థులు వివిఎస్.మనోహర్ గౌండర్, ఎం.శ్రీరాములు అండ్ ఫ్యామిలీ ఉభయ దారులుగా వ్యవహరించారు. అనంతరం రాత్రి



అలంకార భూషితులైన స్వామివారిని రావణబ్రహ్మ వాహనంపై వుంచి వివిధ రకాల వాయిద్యాలు, పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనల నడుమ గ్రామపురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు.

## తవణంపల్లెలో ఘనంగా సైన్స్ దినోత్సవం



**తవణంపల్లె,ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ సివి.రామన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈమేరకు మండలంలోని అన్ని దిగువ తడకర, పట్నం సీఆర్‌సీ కేంద్రాలు తవణంపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్స్ ప్రదర్శనను నిర్వహించారు. ఈప్రదర్శనలను ఎంఈఓ త్యాగరాజులురెడ్డి ప్రారంభించారు. కావున ప్రతి విద్యార్థి భావిభారత శాస్త్రవే త్తలుగా ఎదగాలని అకాంక్షించారు. ఈసందర్భంగా ఆయా పాఠశాలల విద్యార్థులు తయారుచేసిన వివిధ పరికరాలు, ప్రయోగాలను ప్రదర్శించారు. ఈకార్యక్రమంలో తవణంపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం దేవరాజులురెడ్డి, పాటు ఉపాధ్యాయులు, సీఆర్పీలు చిట్టిబాబు, గోపి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

**పుంగనూరు, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :** ఇంటర్ పరీక్షలు శనివారం ఉదయం ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. పుంగనూరులో నానా సాహెబ్ పేట బసవరాజ బాలుర కళాశాల, హైస్కూల్ వీధిలోని బసవరాజ బాలికల కళాశాలలో పరీక్షలు జరగనున్నాయి. ప్రథమ సంవత్సరం 826 మంది, ద్వితీయ సంవత్సరం 816 మంది పరీక్షలకు రాయనున్నారు. 27 పరీక్షా కేంద్రాలు, 30 మంది ఇన్విజిలేటర్లు, చీఫ్ సూపరింటెండెంట్లుగా కమలాకర్, మురళీధర్ లు నియామకమయ్యారు.

## గోవర్ధన్ కుంటుబానికి ఆర్థిక సాయం

**వెదురుకుప్పం, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :** చవట గుంట చెందిన గోవర్ధన్‌రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబంకు టిడిపి క్లస్టర్ ఇన్‌చార్జ్ మోహన్ మురళి శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు లోకనాథ రెడ్డి,మండల ప్రధాన కార్యదర్శి నరసింహ యాదవ్, మండల యువనేత కిరణ్ యాదవ్, మాజీ సర్పంచ్ రాజా రెడ్డి, మాజీ ఎంపిటిసి నందినిచిన్నబ్బ, నియో



జకవర్గం ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు బియం.రవి, మండల ఎస్సీ సెలల్ అధ్యక్షులు వరప్రసాద్, నాయకులు వెంకటాద్రి, చంద్రశేఖర్, గాంధీ, వర్మ, ధనంజేయులు తదితరులు పాల్గొన్నారు.

## దర్జాలేని దర్జీల జీవితాలు



**చౌడేపల్లి, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :** ప్రభుత్వాలు ఎన్ని మారినా ప్రోత్సా హకాలు లేకపోవడంతో దర్జీల జీవితాల్లో వెలుగులు లేవనిఆసంఘ జిల్లా నాయకుడు హైదర్ అన్నారు. అంతర్జాతీయ టైలర్స్‌డే సందర్భంగా మండలం లోని దర్జీలు స్థానిక గాంధీ విగ్రహం వద్ద కుట్టుమిషన్ ఆవిష్కరణకర్త ఎలియాస్ హోవే చిత్రపటాన్ని వుంచి ఘనంగా నివాళులర్పించారు. దర్జీల సంఘ నాయకుడు కూరపర్తి శ్రీనివాసులు, ప్రభాకర్, వెంకట్రమణ, రమేష్, మంజునాథ్, తుంగా రమేష్, సూరాజ్‌నబీ, సులోచన, గాయత్రి, ఆంజప్ప, జబీనా, సునిత, స్వాతి, మండలంలోని దర్జీలు పాల్గొన్నారు.

## విజ్ఞానం మనిషిలో వికాసాన్ని పెంచుతుంది

**చౌడేపల్లి, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :** విజ్ఞానం మనిషిలో వికాసాన్ని పెంచు తుందని పలువురు వక్తల న్నారు. ప్రముఖ శాస్త్రవేత్త దివంగత సర్‌సివిరామన్ జయంతి, జాతీయ సైన్స్‌డేను పురష్కరించుకొని స్థానిక ఉన్నతపాఠశాలలో మండలంలోని 20పాఠశాలలకు చెందిన విద్యార్థులు నమూనాలను ప్రదర్శించారు. గెలుపొందిన



విద్యార్థులకు బహుమ తులు ప్రధానం చేసారు. ఎంఇఓ తిరుమ లమ్మ, ప్రధానోపాధ్యాయుడు నాగరాజరెడ్డి, పిజిటి సుదర్శన్, జగన్మోహన్‌రెడ్డి, మురళి, ఆనంద్, ఉమాశంకర్‌రెడ్డి, పూర్ణిమ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మిద్దింటిని సత్కరించిన మోహన్‌బాబు



**చౌడేపల్లి, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :** బోయకొండ మాజీ ఛేర్మన్ మిద్దింటి శంకరనారాయణను ఎంబియు వ్యవస్థాపక అద్యక్షుడు, ప్రముఖ నటుడు మంచు మోహన్‌బాబు సత్కరించారు. విద్యానికేతన్‌లోని షిర్డీసాయిబాబా ఆలయాన్ని మిద్దింటి సందర్శించారు. స్వామివారి దర్శనానంతరం మోహన్‌బాబు మిద్దింటిని దుశ్శాలవాలతో సత్కరించారు. టిఫిన్ సెంటర్ రాము, చౌడేపల్లికి చెందిన నాయకులు పాల్గొన్నారు.

## శివయ్య సేవలో తెలంగాణ మాజీ మంత్రి జానా



**శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వ రాలయంలో శుక్రవారం తెలంగాణ మాజీ మంత్రి జానారెడ్డి కుటుంబసభ్యులతో శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి వచ్చారు. వారికి శాసనసభ్యుని సతీమణి బొజ్జల రిషితారెడ్డి సారధ్యంలో స్వాగతం పలికారు. దర్శనానంతరం వారికి వేదపండితులతో ప్రత్యేకాశీర్వనాలు అందించి తీర్థ ప్రసాదాలను అధికారులు అందించారు. స్వాగతం చెప్పిన వారిలో సేవా కమిటికి చెందిన మాజీ మార్కెటింగ్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు తదితరులున్నారు.

## సింహావాహనంపై కలియుగ దైవం దర్శనం

**శ్రీకాళహస్తిరూరల్,ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి మండలం తొండమనాడు గ్రామంలో వెలసిన టిటిడి అనుబంధం ఆలయమైన శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఐదవ రోజు ఊంజల్‌సేవా అనంతరం సింహావాహనంపై ప్రతిష్టించి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఆలయ సూపరిం టెండెంట్ జ్ఞాన ప్రకాష్, గోపి, రవి, రమణ, జయకుమార్, మాధవాచార్యులు, బాబులు పర్యవేక్షణలో కార్యక్రమాలలు నిర్వహించారు.



## శివయ్య సేవలో నేషనల్ హైవే చైర్మన్

**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వర స్వామికి శుక్రవారం నేషనల్ హైవేస్ ఛైర్మన్ సంతోష్‌కుమార్, రాష్ట్ర హైవే ఛైర్మన్ ఆర్కే సింగ్‌లు మరియు జిల్లా హైవే ఛైర్మన్ వెంకటేష్‌లు మరియు టిటిడి మాజీ ఛైర్మన్ పుట్టాసుధాకర్‌యాదవ్‌లు విచ్చేశారు. వీరికి మాజీ మార్కెట్ కమిటీ యార్డు ఛైర్మన్ రంగినేని చెంచయ్యనాయుడు మరియు తెలుగుదేశంపార్టీ పట్టణ అధ్యక్షులు విజయకుమార్‌నాయుడు, కంటా రమేష్‌లు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేపట్టారు.



## అంకాళమ్మ ఆలయం వద్ద అన్నదానం

**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** పివిరోడ్డు నందు వెలసి ఉన్న అంకాళమ్మ దేవస్థానం వద్ద గత మూడు సంవత్సరాలుగా అమావాస్య సందర్భంగా మరాఠీ పాళెం వాస్తవ్యులు అయిన యశ్వంత్‌రావు పవార్, బాలాజీరావు, జయగణేష్, రాజశేఖరరావు, సత్యనారాయణరావుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈనెల సహాయ సహకారాలు అందించిన డాక్టర్ కృపానిధి, లోకేష్ యాదవ్, శివకుమార్‌రెడ్డి, క్రాంతికుమార్, ఉపేందర్‌రెడ్డి, రాఘవేంద్ర, గణేష్‌బాబు, వినీత్‌రెడ్డి, నాగేష్, బాబ్జీరావు, సుబ్రాయకామత్, అనూష, షర్మిళ, కల్పన, జ్ఞానప్రసన్న, కృష్ణప్రియ, శ్రీరాం, అరుణ్, భరత్, సాయిప్రదీప్, బాలాజీ, ఓంకార్, నాగేంద్ర, వరప్రసాద్, లీలామోహన, దిలీప్, మయూర ప్రసన్న, రాజేశ్వరరావు, దినకర్‌రెడ్డి, కార్తికేయన్, చేతలిశర్మ, జయంత్‌సింగ్, ఆనంద, నారాయణ్‌దీపాన్స్ యాదవ్, పరమేశ్వరరావు, శ్రవణకుమార్, ప్రదీప్‌రావు, కార్తీర్‌రావు, హరిహరకుమార్, శివప్రసాద్, వినోద్‌కుమార్, సతీష్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

## శ్రీచైతన్యలో ఘనంగా సైన్సు దినోత్సవ వేడుకలు



**తొట్టంబేడు, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** స్థానిక ధర్మరాజుల దేవాలయం వద్ద ఉన్న శ్రీచైతన్య-3 పాఠశాలలో సైన్సు దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో పిల్లలు వివిధ ప్రాజెక్టులు చేసి తల్లిదండ్రులందరినీ ఆకర్షించారు. సుబ్రమహ్మణ్యం రెడ్డి మైక్రో బయాలజీ విభాగం ముఖ్యఅతిథిగా హజరయ్యారు. మరియు విజేతలకు బహుమతులు పంపిణీచేశారు. ఈసందర్భంగా ప్రిన్సిపల్ నిరోష మాట్లాడుతూ నేటి కంప్యూటర్ ప్రపంచంలో విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. దేశాన్ని అభివృద్ధి చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఎజిఎం సురేష్, ప్రిన్సిపల్ నిరోష, డీన్ సురేంద్ర, ఇన్‌ఛార్జి రమేష్, సోనియా, పిఈటి శంకర్, సిబ్బంది మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## దేశం గర్వించదగ్గ శాస్త్రవేత్త రామన్

**రేణిగుంట ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** భారతదేశం గర్వించదగ్గ గొప్ప శాస్త్రవేత్త సివి రామన్ అని గౌతమిస్ ఆక్స్ఫర్డ్ స్కూల్ ప్రిన్సిపల్ గౌతమి అన్నారు. రేణిగుంట గౌతమిస్ ఆక్స్ఫర్డ్ స్కూల్ నందు శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్స వం సందర్భంగా సైన్స్ ఎగ్జిబిషన్ జరిగింది. విద్యార్థులు అనేక నమూనాలను తయారు చేసి ప్రదర్శనలో ఉంచారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కన్నులపండువగా అగస్త్యేశ్వరుని కళ్యాణం



**తొట్టంబేడు, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** మండలం లోని పెద్దకన్నలి గ్రామంలో శ్రీకాళహస్తీ శ్వరాల యానికి అనుబంధ ఆలయంగా వెలసిన దుర్గాంబిక సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి కళ్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి ముస్తాబుచేసి ఆలయ ఆవరణలో ఆశీసుల్ని చేశారు. అనంతరం ఆలయ అర్చకులు ప్రసాద్‌శర్మ, రాజశేఖర్‌శర్మ, మనోహర్ శర్మ, వేదపండితులుకృష్ణ ప్రసాద్ తదితరులు వేదమంత్రాలు పఠిస్తుండగా స్వామిఅమ్మవార్ల కళ్యాణోత్సవం కన్నులపండువగా సాగింది. కార్యక్రమంలో చిన్న ఆలయాల ఇన్‌ఛార్జి లక్ష్మయ్య, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎపిఎస్‌పిడిసిఎల్ సారధ్యంలో అన్నదానం

**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి అమ్మవార్ల కళ్యాణోత్సం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్(1104) ఎపిఎస్‌పిడిసిఎల్ డిస్కమ్ కార్యదర్శి వి.దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గత 14 సంవత్సరాలుగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో సుధారాణి, రూరర్ డిఈఈ సుబ్రమణ్యం, మరియు ఏఏఓ, ఎఈలు మరియు విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ చైతన్యలో ఘనంగా విజ్ఞాన ప్రదర్శన

**రేణిగుంట ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** రేణిగుంట పట్టణం శ్రీ చైతన్య పాఠశాలలో శుక్రవారం సర్ సివి రామన్ ఖిరామన్ ఎఫెక్ట్‌ఖి ను ప్రపంచానికి అందించిన గొప్ప రోజును పురస్కరించుకొని విజ్ఞాన ప్రదర్శనను నిర్వహించారు. పలువురు ప్రదర్శనను సందర్శించి విద్యార్థులు రూపొందించిన అనేక విజ్ఞాన నమూనాలను తిలకించి సంతోషం వ్యక్తం చేశారు.



కార్యక్రమంలో శ్రీ చైతన్య విద్యా సంస్థ ఏజీఎం సురేష్, ప్రిన్సిపల్ చారుమతి, డీన్ గోవర్ధన్ పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్



## ఘనంగా జాతీయ విజ్ఞాన దినోత్సవం

**పాకాల, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :** పాకాల స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు ఇన్చార్జ్ హెడ్మాస్టర్ జై చంద్ర ఆధ్వర్యంలో లైన్స్ క్లబ్ సహకారంతో జాతీయ వైజ్ఞానిక దినోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్య, ఆరోగ్యం, వ్యవసాయం రంగాలలో నూతన ఆవిష్కరణలు తక్కువ శక్తితో ఎక్కువ ఫలితాలు రాబట్టటం నూతనవిద్యార్థులలో చైతన్యం నింపారు.

## తొలి ఇంద్రజాల బడ్జెట్

**తిరుపతి(రవాణ)ఫిబ్రవరి28ప్రభాతవార్త:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తొలిసారిగా ప్రవేశపెట్టిన బడ్జెట్ శూన్యంగామారి ఇంద్రజాల బడ్జెట్‌గా తయారైందని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు గౌడపేర చిట్టిబాబు విమర్శించారు. ఎంతో అనుభవం ఉన్న సిఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం బడ్జెట్ అంకెల గారడి,అభూత కల్పన తప్ప హామీలకు గ్యారంటీ లేదన్నారు. హామీలను పూర్తిగా విస్మరించారని,సూపర్ సిక్స్ పథకాలకు పంగనామాలు పెట్టారని ఎద్దేవచేశారు. అన్నదాత సుఖీభవ పథకానికి 6300 కోట్లు కేటాయించారని, రాష్ట్రంలో 54 లక్షలమంది రైతులు ఎదురుచూస్తుంటే 11వేల కోట్లు నిధులు కావాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఊసేలేదన్నారు. 3లక్షల కోట్ల బడ్జెట్‌లో నెలకు 350కోట్లు కేటాయించేపథకానికి నిధులివ్వడానికి కూటమి ప్రభుత్వానికి మనసురాలేదన్నారు. కోటిన్నర మంది మహిళలను అన్యాయం చేయడమేనని విమర్శించారు.



## మసీదు ప్రెసిడెంట్‌గా హమీద్‌ఖాన్

**కార్వేటినగరం,ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** కార్వేటనగరం మసీదు ప్రెసెడెంట్‌గా పి.హమీద్‌ఖాన్‌ను ముస్లీం సోదరులు శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం కార్వేటినగరం జామియా మసీదులో నిర్వహించిన సమావేశంలో మసీదు ప్రెసెడెంట్ (ముత్తువలి)ఎంపికయ్యారు. కార్యక్రమంలో రఫీ, సౌషద్, ఇస్మాయిల్, మహమ్మద్‌ఆలీ, లాల్‌బాష,అల్తాఫ్,నిషార్,షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

## కూటమి తొలి బడ్జెట్...రాష్ట్ర అభివృద్ధికి తొలి అడుగులు

**తిరుపతి హెల్త్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :** గత వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధికి నోచుకోలేదని, కూటమి ఏర్పడిన తర్వాత తొలి బడ్జెట్‌లో ఏపీ రాష్ట్ర అభివృద్ధికి ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు లోకేష్‌బాబు, పయ్యావుల కేశవ్ తొలి అడుగులు వేయడం అభినందనీయమని టీడీపీ



తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు, మాజీ తుడా ఛైర్మన్ నరసింహయాదవ్ తెలిపారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీడీపీ రాష్ట్ర మీడియా కో-ఆర్డినేటర్ శ్రీధర్ వర్మతో కలిసి మాట్లాడారు. ఏపీలో గత వైసీపీ రాక్షస పాలన పోయిన తర్వాత కూటమి అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలలోనే రాష్ట్ర అభివృద్ధికి పెద్దపీట వేసిన విషయాన్ని గుర్తు చేశారు. 2025-26 కూటమి బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో 3లక్షల 22 వేల 350 కోట్ల నిధులు విడుదల చేశారు.గత ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలకు సీఎం నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను నూటికి నూరు శాతం అమలు చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలుగు తమ్ముళ్ళు జయరాం, హేమంత్, చెంగయ్య, సుబ్బు, తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక తనిఖీలో సిబ్బందికి మందలింపు

**చంద్రగిరి, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** చంద్రగిరి మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా 915 పనులు చేసినట్లు పిడి ద్వామా శ్రీనివాస్ ప్రసాద్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలో మొత్తం 915 పనులకు



రూ.8,17,00,876/-లు ఖర్చు చేసినట్లు వివరించారు. ఇందులో ఉపాధిహామీ పథకంలో 888 పనులు చేపట్టినట్లు వివరించారు. చెట్లు నాటి వాటిని సంరక్షించడంలో విఫలమైనందుకు సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించాలని ఆదేశించారు. అదేవిధంగా ఒకరి జాబ్ కార్డుపై మరొకరు పనిచేయడాన్ని తప్పుబడుతూ మందలించారు. కుటుంబ సభ్యులు కావడంతో అనుమతించినట్లు ఉపాధి సిబ్బంది వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మావిళిరెడ్డిగారి హేమేంద్రకుమార్ రెడ్డి, డివిఓ శివయ్య, ఏవిఓ గణేష్‌కుమార్ ఏపిడి చిన్నరెడ్డెప్ప, ఎంపిడిఓ శేఖర్, ఎస్ఆర్‌పి రవి, ఏపిఓ జ్యోతి, టిడిపి నాయకులు వీరంగారి రమేష్ రెడ్డి, గౌస్‌భాషా, తదితరులు పాల్గొన్నారు.

## రామన్ ప్రతిభకు పురస్కారమేసైన్స్ డే



**చంద్రగిరి, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** భారతీయ శాస్త్రవేత్త సర్ సి.వి.రామన్ ప్రతిభకు పురస్కారమే జాతీయ విజ్ఞాన దినోత్సవం (సైన్స్ డే) అని ఎంఈఓ శ్రీవరం లలితకుమారి అన్నారు. జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని పురస్కరిం చుకుని శుక్రవారం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలలో విద్యార్థినులు తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీవరం లలితకుమారి, ఎంఈఓ-2 భాస్కర్ బాబు నరశింగాపురం, కొంగరవారిపల్లి, చంద్రగిరి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, శ్రీపద్మావతీ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్ ప్రదర్శనలను ప్రారంభించారు. హెచ్ఎంలు రామమూర్తి, వెంకటరమణారెడ్డి, విజయ, తదితరులు పాల్గొన్నారు.



## సామాన్య ప్రజలకు మొండి చెయ్యి : సీపీఐ

**తిరుపతి, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** ఏపీ శాసన సభలో శుక్రవారం ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ సామాన్య ప్రజలకు మొండి చేయి మిగిలిచ్చారని మాటలు ఎక్కువ చేతల్లో ఏమీ లేదన్నట్లుగా ఉందని సీపీఐ జిల్లా కార్యదర్శి పి. మురళీ తీవ్రంగా విమర్శించారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు, డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఈ బడ్జెట్ అప్పులు బడ్జెట్‌గా మిగిలిపోతుందని స్పష్టం చేశారు.

## విద్యార్థులు సమాజానికి దిక్సూచిలా ఎదగాలి

తిరుపతి విద్య,ఫిబ్రవరి 28 ప్రభాతవార్త: విద్యార్థులు సమాజానికి దిక్సూచిలా ఎదగాలని, పరిశోధన ఫలాలు సామాన్యులకు చేరేలా ప్రావీణ్యం సంపాదించాలని సోక్రటీస్ ఐకాన్ విద్యా సంస్థల కరస్పాండెంట్ ప్రదీప్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక బైరాగిపట్టెడ లో ఉన్న సోక్రటీస్ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని



శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా వర్సిటీలో ఘనంగా టెకెఫెస్ట్

**తిరుపతి విద్య, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** పద్మావతి మహిళా వర్సిటీ ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో టెక్ఫెస్ట్ సధర్వ 2025 పేరుతో రెండు రోజుల పాటు జరిగే కార్యక్రమం శుక్రవారం ఘనంగా వర్సిటీలో ఘనంగా ప్రారంభమైంది.ఈ కార్యక్రమానికి ఇస్రో రిటైర్డ్ జనరల్ మేనేజర్ జె గోపాలకృష్ణ ముఖ్యఅతిథిగా విచ్చేసి విద్యార్థులకు పలు అంశాలపై



అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఓఈటీ డైరెక్టర్ మల్లికార్జున,ప్రొఫెసర్ సత్యనారాయణ,కోఆర్డినేటర్ మాధవి, శ్రీనివాస పద్మజా, డాక్టర్ రామకృష్ణ, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.



## దర్జాను కల్పించేది దర్జీలే!

**రేణిగుంట ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** నాగరికతకు మైలురాళ్లు, అందరిలో రాజసంతోపాటు దర్జాను కల్పించేది దర్జీలేనని రేణిగుంట దర్జీల సంఘం నేతలు అన్నారు. రేణిగుంట శ్రీ గంగమ్మ సూలం వద్ద అంతర్జాతీయ దర్జీల దినోత్సవం సందర్భంగా శుక్రవారం దర్జీలందరూ పెద్ద ఎత్తున అన్నసంతర్పణ చేశారు. ప్రభుత్వం ఆర్థిక సహాయం చేసి దర్జీలకు చేయూతనివ్వాలని కోరారు. కార్యక్రమంలో దర్జీలు శేఖర్, హరి రెడ్డి, టైలర్ శేఖర్, సుభాన్, మస్తాన్, కాజా, రమేష్, శంకర్, రహీం, వహీద్, తదితరులు పాల్గొన్నారు.

## యువత ఆదర్శంగా జీవించాలి... రాజేష్ రెడ్డి

**రేణిగుంట, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :** యువత రాబోవు తరాలకు ఆదర్శంగా జీవించాలని యువ పారిశ్రామికవేత్త, యువ నేత రొమ్మాల రాజేష్ రెడ్డి అన్నారు. రేణిగుంట మండలం కొత్ర మంగళంకు చెందిన రొమ్మల రాజేష్ రెడ్డి జన్మదిన వేడుకలు తనపల్లి సురేష్ ఫుడ్ బేవరిస్ కర్మాగారంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి అందరికీ పంచారు. కార్యక్రమంలో సురేష్ రెడ్డి, జ్యోత్స్న, లాలిత్య, దివ్య, పరిశ్రమలో పనిచేసే ఉద్యోగులు కార్మికులు పాల్గొన్నారు.



## ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



**విజయపురం, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** విజయపురం మండలం శ్రీహరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు జ్ఞానప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల్లోని అంతర్గత సామర్థ్యాలను వెలికి తీయడానికి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు ఉపయోగపడుతాయని పేర్కొన్నారు. క్విజ్, వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు విజయచంద్రిక, సునీత, గోపి, వెంకటేష్, విజయకుమార్, వెంకమరాజు, విజయవర్మ, లక్ష్మీపతి పాల్గొన్నారు.

## పుత్తూరులో జాతీయ విజ్ఞాన దినోత్సవం

**పుత్తూరురూరల్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** జాతీయ విజ్ఞాన దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండలంలోని పరమేశ్వరమంగళంలోని శ్రీ చైతన్య పాఠశాలలో సర్ సీవీ రామన్ జన్మదిన దినోత్సవ సందర్భంగా జాతీయ విజ్ఞాన దినోత్సవ వేడుకలు ఏజీఎం సురేష్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి.



ప్రధానోపాధ్యాయుడు గోపి మాట్లాడుతూ భారతదేశం ఇంత వేగంగా అభివృద్ధి చెందడానికి సైన్సే కారణమని, విద్యార్థులు సైన్స్ మీద మక్కువ పెంచుకోవాలని, వినూత్నమైనటువంటి ఆలోచనలతో ప్రాజెక్టులు తయారు చేయాలని తెలిపారు.

## నేడే ఇంటర్ పబ్లిక్ పరీక్షలు

**సత్యవేడు, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** సత్యవేడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మార్చి1 నుంచి ఇంటర్ పబ్లిక్ పరీక్షలు జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ జగన్మోహన్ ఆచారి పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు అన్ని కూడా పూర్తి చేయడం జరిగిందన్నారు. కళాశాలలో ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరాలు సంబంధించి 310 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారని ఆయన తెలిపారు. ఇంటర్ పరీక్షల కోసం 12 గదులను కేటాయించినట్లు పేర్కొన్నారు. కాగా ఇంటర్ పరీక్షలకు ప్రధాన పరీక్షా అధికారిగా జగన్మోహన్ ఆచారి, డిపార్ట్‌మెంట్ అధికారిగా జాకీర్ హుస్సేన్ వ్యవహరించనున్నారు.



## ఎస్‌జీఎస్‌ఆర్ట్స్‌కళాశాలలో సైన్సు దినోత్సవం.



**తిరుపతి విద్య, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :** శ్రీ గోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాలలో సైన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో జాతీయ సైన్సు దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయని కళాశాల ప్రిన్సిపాల్ డా.బి.సత్యనారాయణ తెలిపారు. జాతీయ సైన్సు దినోత్సవం సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డి.పరమేశ్వర, సైన్స్ క్లబ్ కన్వీనర్ పి. ఉదయ,ఫిజిక్స్ అధ్యా పకులు పి. వెంకటాచలపతి,డా.ఎన్. జగదీష్ కుమార్ విద్యార్థుల నిర్దేశించి ప్రసంగించి చక్కని సందేశమిచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డా.జే. కొండలరావు, డా.కె. కోటేశ్వరయ్య ఇ.విజయభాస్కర్,కె.భాస్కరస్, బి.ఉమా మహేశ్వరీ, అధ్యాపక బృందం, విద్యారినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## గీతం హైస్కూల్ నందు సైన్సు దినోత్సవం



***తిరుపతి విద్య ఫిబ్రవరి 28 ప్రభాత వార్త*** నేషనల్ సైన్స్ డే సందర్భంగా గీతం పాఠశాలలో విద్యార్థులు సైన్సు ఎగ్జిబిషన్ నిర్వహించారు.సర్.సివి రామన్ ఎఫెక్ట్ ప్రపంచానికి అందించిన సేవలను గుర్తించుకొని,భారత ఫిజిస్ట్ కి నివాళులర్పించారు.ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ డాక్టర్ మంజునాథ్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ తమ్మినేని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చిన్నతనం నుంచే విద్యార్థులలో సైంటిఫిక్ దృక్పథం అభివృద్ధి చేయాలన్నారు.

## సాంకేతికరంగంలో విశ్వగురువుగా భారత్ వికసిస్తుంది:వీసీ

**తిరుపతి విద్య, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** శాస్త్ర సాంకేతిక రంగాలలో 2047నాటికి విశ్వగురువుగా భారత్ వికసిస్తుందని ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావు ఆశాభావం వ్యక్తం చేశారు.ఎస్వీయూ ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో నేషనల్ సైన్స్ డేని వర్సిటీలోని శ్రీనివాస ఆడిటోరియంలో ఘనంగా



నిర్వహిం చారు. సాంస్కృతిక విభాగ కోర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ అధ్యక్షతన ఖిసైన్స్ డ్రామాఖి పేరుతో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమానికి వీసీ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఈ రిజిస్ట్రార్ భూపతి నాయుడు,ఫిజిక్స్ విభాగం హెడ్ దేవప్రసాద్ రాజు,ఎన్సి రాయుడు, ఆచార్యులు సురేంద్రబాబు, విజయభాస్కర్ రావు, రుద్రమదేవి,నరసింహ, నాదముని,కళ్యాణ్,శరత్ బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పద్మావతి మహిళా వర్సిటీలో ఘనంగా సైన్స్ డే



**తిరుపతి విద్య, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** పద్మావతి మహిళా వర్సిటీ ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో సైన్స్ డే ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎస్వీయూ ప్రొఫెసర్ డాక్టర్ హేమలత రుద్రమదేవి పాల్గొని సీవీ రామన్ ఎఫెక్ట్ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ శ్రీదేవి, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## సైన్స్‌తోనే సమాజాభివృద్ధి

**బుచ్చినాయుడు కండ్రిగ, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** నిరంతరం మన జీవనశైలి సైన్స్‌తోనే ప్రారంభమవుతుందని ప్రధానోపాధ్యాయులు రూపేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం సీవీ రామన్ ఎఫెక్ట్ కనుగొన్న దినమైన జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయులు ఒబ్బు ప్రసాద్, లక్ష్మయ్యల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## శాఫ్ చైర్మన్‌ను కలిసిన క్రీడాకారిణి సత్యజ్యోతి



**తిరుపతి క్రీడ, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :** విజయనగరానికి చెందిన క్రీడాకారిణి టి.సత్యజ్యోతి విజయవాడలోని శాప్ కార్యాలయంలో శాప్ ఛైర్మన్ రవినాయుడుని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసారు. ఇటీవల ఉత్తరా ఖండ్‌లో జరిగిన 38వ జాతీయ క్రీడాపోటీల్లో వెయిట్ లిఫ్టింగ్ +87 కేటగిరీలో బ్రాంజ్ మెడల్ సాధించినట్లు వివరించారు. ఈ సందర్భంగా సత్యజ్యోతిని శాప్ ఛైర్మన్ అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని, శాప్ నుంచి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

## స్వచ్ఛ సర్వేక్షన్‌పై అవగాహన కల్పించాలి : కమిషనర్

**తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** నగరంలోని ప్రజలకు స్వచ్ఛ సర్వేక్షన్ పై అవగాహన కల్పించాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరంలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని ఏర్పాటు చేస్తున్న మల్టి స్పోర్ట్స్ ఫెసిలిటీ సెంటర్ నిర్మాణ పనులను, జగజ్జీవన్ రామ్ పార్కును అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మౌర్య మాట్లాడుతూ పార్కుల్లోని మరమ్మతులకు గురైన పరికరాలను సరి చేయాలని, మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచాలని తెలిపారు.కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, తుడా ఈఈ రవీంద్ర, మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్, డి.ఈ.లు రాజు, మధు, మహేష్, రమణ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, ఏఈకాం ప్రతినిధి బాలాజి, తదితరులు ఉన్నారు.



## బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలి

**కేవీబీపురం, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** బాల్య వివాహాలపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ షఫేర్డు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం ప్రభాతవార్తతో మాట్లాడుతూ బాల్య వివాహాలు ఎక్కువగా జరిగే అవకాశాలు జరిగే అవకాశాలు ఉంటాయన్నారు. ఎక్కువగా బాల్య వివాహాలు చేసుకునేది ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలకు సంబంధించిన వారని, గతంలో ఎక్కువగా బాల్య వివాహాలు ప్రోత్సహించిన మన ఆధారాలు ఒకేత్తయితే ఇంకొకటి గ్రామీణ ప్రాంతాల్లో పేదవారు కులాలకు సంబంధించిన వారన్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపి బాల్య వివాహాల నిషేధించుటలో కిందిస్థాయి అధికారులతో ప్రచారం మాధ్యమాలతో ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన తెలిపారు.

## పార్టీ బలోపేతమే మా లక్ష్యం

***కేవీబీ పురం, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:*** వాడవాడలా భారతీయ జనతా పార్టీని బలోపేతం చేయడమే మా లక్ష్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు నాలి బాబుయాదవ్ అన్నారు. మండలంలోని రాయపేడు, వగత్తూరు గ్రామాల్లోని బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షుల ఇంటి వద్ద పార్టీ జెండాను ఎగురవేసే కార్యక్రమం చేపట్టారు.కార్యక్రమంలో బూత్ అధ్యక్షుడు స్వయరాజ్, శశికుమార్ పాల్గొన్నారు.

## మండలంలో ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం

**కేవీబీ పురం, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** స్విమ్స్ ఆధ్వర్యంలో మండలంలోని తిమ్మసముద్రం, బైరాజుల కండ్రిగలో సర్పంచ్ ఎర్రం దొరబాబు అధ్యక్షతన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్య పరీక్షలు నిర్వహించారు. తిరుపతి శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ(స్విమ్స్) ఆధ్వర్యంలో శుక్రవారం కోవనూరు పీహెచ్‌సీ పరిధిలోని తిమ్మసముద్రం, బైరాజుల కండ్రిగ గ్రామాల్లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పీహెచ్‌సీ వైద్యాధికారి జగదీష్, స్విమ్స్ మెడికల్ ఆఫీసర్లు హరిత, చైతన్య భాను, సర్పంచ్‌లు గౌతమి, చెంచుప్రకాష్, పంచాయతీ కార్యదర్శులు సురేష్, యువరాజ్, ఎంఎల్‌హెచ్‌పీ అలేఖ్య, ఏఎన్ఎంలు యమున, మోహనమ్మ, పార్వతి, స్థానిక వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## సర్పంచ్ తండ్రి ప్రకాశం మృతికి నివాళి



**సత్యవేడు, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** సత్యవేడు మండలం పెద్ద ఈటిపాకం గ్రామ సర్పంచ్ రూబెన్ తండ్రి ప్రకాశం మృతదేహానికి పలువురు వైసీపీ నేతలు నివాళులర్పించారు. శుక్రవారం వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజేష్, బీరేంద్రవర్మ, భానుప్రకాష్ రెడ్డి, వైస్ ఎంపీపీ రాబర్ట్, సర్పంచ్‌లు రవిరెడ్డి, శేఖర్, గోవిందస్వామి, మధురాజు, ఎం.పి.రవి, పళణి, రాజశేఖర్, మునికుమార్, చెంగయ్య తదితరులు రాచపాళెంలోని సర్పంచ్ రూబెన్ స్వగృహానికి ఘనంగా నివాళులర్పించారు.

## ఎంపీడీవోకి వినతిపత్రం అందించిన సీపీఐ

**పుత్తూరురూరల్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** ఉపాధి కార్మికులకు పెండింగ్‌లో ఉన్న నిధులు విడుదల చేయాలని సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) ఆధ్వర్యంలో పుత్తూరు ఎంపీడీవోకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంకు పెండింగ్‌లో ఉన్న నిధులు విడుదల చేయాలని ఉపాధిహామీ పథకం జాతీయ స్థాయిలో పని దినాలు సంవత్సరంలో 200 రోజులు కల్పించాలని దినసరి కూలీ ఉపాధి కార్మికులకు 700 రూపాయలు పెంచాలని ఆరోహరైన ప్రతి ఒక్కరు కార్మికులకు జాబ్‌కార్డులు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గోపి, రాజేష్, భాస్కర్, రవి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ టైలర్స్‌డే

**పుత్తూరురూరల్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** పుత్తూరు మహిళా టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని పిడికిలి గంగమ్మ ఆలయంలో అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం(ఎంఐసీడీఏ) వృద్ధాశ్రమంలో వృద్ధ మహిళలకు ఉచిత వైద్య శిబిరం, మందులు అందించారు. తదుపరి అన్న దానం కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ డైరెక్టర్ నాగరత్న, ఉపాధ్యక్షురాలు పుష్పలత, మండల కమిటీ డైరెక్టర్ వార్తల రజని యాదవ్, టైలర్స్ శైలజ, తులసి, గాయత్రి, నిర్మల, భావన, హరిప్రియ, హోమియోపతి డా. అసిస్టెంట్ ప్రొపెర్ సాయితీ. డాక్టర్‌మెడికల్ ఆఫీసర్ శ్రావ్య, ఇంటర్నిస్ గ్రేసిపేసి శీభ ప్రియాంక, ధరణి, అఖిల తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక అభివృద్ధికి అనుగుణంగా బడ్జెట్ : బొజ్జల



**శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూపొందించిన బడ్జెట్ అద్భుతంగా ఉందని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం విడుదల చేసిన బడ్జెట్‌పై శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ అమలుకు నిధులు విడుదల చేసారన్నారు. అంతేకాక యువతకు ఉపాధికి, అందరికి విద్యను అందించుటకు ప్రత్యేకంగా నిధులు కేటాయించటం విద్యపట్ల మంత్రి లోకేష్‌కు గల గుర్తింపుకు నిదర్శనం అన్నారు. తిరుపతి జిల్లాలోనూ, శ్రీకాళహస్తి పరిసర ప్రాంతాల్లో పరిశ్రమల అభివృద్ధికి చక్కటి కేటాయింపులు జరిగా యన్నారు.అలాగే సోమశిల-స్వర్ణముఖి కాలువతో నియోజకవర్గం సస్యశ్యామలం కాగలదన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయం అభివృద్ధితో పాటు మాస్టర్‌ప్లాన్‌ను అమలు చేయనున్నట్లు వివరించారు.



## అల్లాహ్‌ను శరణుగోరండి:రేహాన్

**శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** వరాలిచ్చే రంజాన్ మాసం వచ్చేసింది. మనల్ని పుట్టించిన అల్లాహ్‌ను శరణుజొచ్చి తమకు తప్పులనుక్షమించి స్వర్గస్తుల్ని చేయాలని ప్రార్థించాలని హాఫీజేఖుర్ ఆన్ రేహాన్ సాహెబ్ పిలుపు నిచ్చారు. శుక్రవారం జామియా మస్జిద్‌లో ప్రత్యేక ప్రార్థనల తరువాత ఆయన రంజాన్ మాసానికి ముందు వచ్చిన శుక్రవారం మహమ్మద్ ప్రవక్త సొల్లె అలా సొలం ఇచ్చిన పవిత్రమైన సందేశాన్ని వివరిస్తూ పలువురు పుణ్యమూర్తుల సందేశాలను వివరించారు. రంజాన్ మాసంలో 'తరావీహ్ నమాజులు' మనస్పూర్తిగా చేయాలన్నారు. నెలవంక దర్శనంతో తరావీహ్ నమాజులు ప్రారంభం అవుతాయని రేహాన్ వివరించారు.

## కైలాస్‌గ్రాండ్‌చే నిరంతర భోజన సదుపాయాలు

**శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తిలోని తేరువీధిలోని 'కైలాస్‌గ్రాండ్' నిర్వాహకుల సారధ్యంలో ప్రతి ఏడాది మహాశివరాత్రి సందర్భంగా మూడు రోజుల పాటు నిరంతరం మూడు పూటలా భక్తుల ఆకలి తీర్చే కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. ఈ నేపధ్యంలో మూడు రోజులుగా నిరంతరం వేలాది మందికి భోజనాలు అందిస్తున్నారు. శుక్రవారం ఉదయం అల్పాహారం,మధ్యాహ్నం, భోజనం, రాత్రిస్వామిఅ మ్మవార్ల కళ్యాణోత్సవం సందర్భంగా విజటబుల్ బిరియానిని అందించారు. ఈ కార్యక్రమాలను లీజు దారులు రామకృష్ణారెడ్డి, ఆనంద్,సుధాకర్, విజయనాయుడులు నిర్వహించారు.




## జంగం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం

**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** జంగమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం పట్టణంలోని రాజగోపురం ఎదురుగా ఉన్న రెండో గేటు వద్ద భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర జంగం దేవర సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షులు కొండపల్లి బ్రహ్మజీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో పట్టణ జంగమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చేజర్ల సుబ్బరాయులు, ఉపాధ్యక్షులు కారణి సుబ్రమణ్యం, కార్యదర్శి కారణి ఉదయ్‌కిరణ్, నాగభూషణం, తలమంచి చెంగయ్య, మరియు జంగమకుల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.


కెనరా బ్యాంక్ Canara Bank Together we can — ఎం.ఆర్.పల్లి-2 శాఖ, తిరుపతి, తిరుపతి జిల్లా

రుణగ్రహీత/ హామీదారు/ తనఖాదారులకు సెక్షన్ 13(8) క్రింద

**రిడెంప్షన్ నోటీసు**

టు: రుణగ్రహీత:శ్రీ గూలూరు మణి, తండ్రి జి.మారయ్య, ఇ.నెం.6-6, శ్రీ వేంకటేశ్వర కాలనీ, శెట్టిపల్లి, మంగళం, తిరుపతి - 517507

హామీదారు: శ్రీ శ్రీహరి గూలూరు, తండ్రి జి.మారయ్య, ఇ.నెం.6/7, శ్రీ వేంకటేశ్వర కాలనీ, శెట్టిపల్లి, మంగళం, తిరుపతి - 517507

అయ్యా/ అమ్మా !

**విషయం: సర్ఫేసి చట్టం, 2002లోని సెక్షన్ 13(8) క్రింద ప్రకారం విముక్తి హక్కును అమలు చేయడం కోసం నోటీసు**

తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల గౌరవనీయ హైకోర్టు, హైదరాబాద్ న్యాయవ్యవస్థ నిర్దేశించిన ప్రతిపాదనకు అనుగుణంగా అమ్మకపు నోటీసు ప్రచురణ తేదికి ముందుగా, సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకోవడానికి తనఖాదారునికి 30 రోజుల ప్రత్యేక నోటీసు జారీ చేయబడుచున్నది.

రుణఖాతా శ్రీ మణి గూలూరు (రుణగ్రహీత) మరియు శ్రీ శ్రీహరి గూలూరు (గ్యారంటారు) వారిని బకాయి **రూ.9,73,999.99 (రూపాయలు తొమ్మిది లక్షల డెబ్బై మూడు వేల తొమ్మిది వందల తొంబై తొమ్మిది రూపాయల తొంభై తొమ్మిది పైసలు మాత్రమే)** మరియు వడ్డీ, ఖర్చులు మరియు ఇతర ఛార్జీలతో కలిపి మొత్తం చెల్లించవలసినదిగా కోరుతూ కెనరాబ్యాంక్, ఎం.ఆర్.పల్లి -2 శాఖ యొక్క అధీకృత అధికారి **06.06.2023**వ తేదీన డిమాండ్ నోటీసు జారీ చేయడమైనది.

పైన తెలిపిన డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో మీరు విఫలమైనందున కెనరా బ్యాంక్ యొక్క అధీకృత అధికారి తేది: 24.08.2023న మీ సెక్యూర్డ్ ఆస్తులను లాంఛనాత్మకంగా / భౌతికంగా స్వాధీనం చేసుకున్నారు. మరియు చట్టం ప్రకారం సదరు స్వాధీనతా నోటీసును **ఆంధ్రజ్యోతి (తెలుగు) మరియు ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్(ఇంగ్లీష్) వార్తాపత్రికలలో తేది: 30.08.2023**న ప్రచురించడ మైనది.

ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా మీరు తేది: 06.06.2023 నాటి డిమాండ్ నోటీసులో పేర్కొన్న బకాయి మొత్తం **రూ.9,73,999.99 (రూపాయలు తొమ్మిది లక్షల డెబ్బై మూడు వేల తొమ్మిది వందల తొంబై తొమ్మిది రూపాయల తొంభై తొమ్మిది పైసలు మాత్రమే)** + వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు కలిపి మొత్తమును చెల్లించి బ్యాంకు వారు స్వాధీనం చేసుకున్న మీ ఆస్తులను విడిపించుకొనుటకు ఆఖరి మరియు చివరి అవకాశం కల్పించడమైనది. ఒక వేళ మీరు చెల్లించుటలో విఫలమైన యెడల దిగువ వివరించి ఏదేని విధానాల ద్వారా అమ్మకం జరుపుటకు దినపత్రికలలో అమ్మకం ప్రకటన ప్రచురితమవుతుంది (ఎ) ఇటువంటి సెక్యూర్డ్ ఆస్తును కొనుగోలు చేయు వారి నుండి లేదా సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయు ఆసక్తి గల వారి నుండి కొటేషన్లు ఆహ్వానించుట లేదా (బి) ప్రజల నుండి టెండరు ఆహ్వానించుట లేదా (సి) ఇ-వేలం పద్ధతిలో బహిరంగ వేలంను నిర్వహించుట లేదా (డి) ప్రైవేట్ ఒప్పందం ద్వారా. దినపత్రికలలో అమ్మకం ప్రకటన ప్రచురణ తేదికి ముందుగా సర్ఫేసి చట్టం యొక్క సెక్షన్ 13(8) ప్రకారం మీరు మీ సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకునే హక్కు కలిగి ఉంటారు, ఒక వేళ విఫలమైనచో, సెక్షన్ 13(8) ప్రకారం ఆస్తిని విడిపించుకునే హక్కును కోల్పోవుదురు. చట్టం నందు / అమలులోవున్న ఏదైనా ఇతర న్యాయపరిధిలో బ్యాంకును ఏలాంటి ఇతర హక్కులకు భంగం వాటిల్లకుండా ఈ నోటీసు జారీ చేయడమైనది.

స్థలం : తిరుపతి
తేది: : 25.02.2025

సం॥ అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

## కాశీవిశ్వేశ్వరాలయంలో వసంతోత్సవాల



తడ, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త : తడ మండలం మాంబట్టులోని కాశీవిశ్వేశ్వ రాలయం, అండగుండల మార్గం లో ఉన్న పాడిమిట్టలోని నాగలింగేశ్వరస్వామి ఆలయాల్లో మహాశివరాత్రి ఉత్సవాలు మూడవ రోజు కూడా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇక్కడ వసంతోత్సవాల సందర్భంగా గ్రామోత్సవాలు జరిపారు. మాంబట్టు పంచాయతీ పరిధిలోని ఎన్ఎం కండ్రిగలో అక్కడి ఉభయకర్తలు వేడుకలు నిర్వహించారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో మండలంలోని పలు శివాలయాల్లో ఇప్పటికే స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాలు కన్నుల పండువగా ముగిశాయి.

## మండల విద్యాశాఖ నూతన భవనం ప్రారంభం

తడ, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త : తడలో పానాసోనిక్ కంపెనీ వారి వితరణతో నూతనంగా విద్యాశాఖ కార్యాలయం శుక్రవారం ప్రారంభించారు. ఆ కంపెనీఎండి సెంథిల్‌కుమార్ ఈ సందర్భంగా మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా పాత భవనం దెబ్బతిని ఉన్నందున విద్యాశాఖ వారి విజ్ఞప్తి మేరకు తాము సుమారు రూ.20 లక్షలు కేటాయించి ఈ భవనాన్ని నిర్మించామని చెప్పారు. ఎంపిడిఓ ఎన్.విజయ కుమార్, ఎంఇఓలు సరస్వతి, మల్లికార్జున్, పలువురు ఉపాధ్యాయులు, విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది, పానాసోనిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీహరికోటలో జాతీయ సైన్స్ దినోత్సవం



శ్రీహరికోట (తడ), ఫిబ్రవరి 28 ప్రభాతవార్త : చంద్రశేఖర్ వెంకటరామన్ అనబడే సివి రామన్ పేరుకు గుర్తుగా జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శ్రీహరికోటలో నిర్వహించారు. ఈ సందర్భంగా సివి రామన్ చేసిన పలు పరిశోధనలు గురించి చర్చించారు. ఆయన మేధాశక్తిని ప్రపంచ శాస్త్రవేత్తలు సైతం గుర్తించారని, తక్కువ ఖర్చుతో ఖరీదు చేసే పరికరాలు రూపొందించి ప్రపంచ దేశాల్లో పేరు పొందారని గుర్తు చేసుకున్నారు. నోబెల్ బహుమతి గ్రహీత అయిన సివి రామన్ భౌతికశాస్త్రంలో తాను చేసిన సేవలను విశిష్ట గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏ.రంగరాజన్, ఎం.శ్రీనివాసులురెడ్డి, డిడిలు, అడ్మినిస్ట్రేషన్ ఉద్యోగులు పాల్గొన్నారు. ఆయన సేవలను గుర్తుంచుకుంటూ శ్రీహరికోట వంటి కేంద్రాల్లో కూడా ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం మంచి పరిణామంగా పలువురు చెప్పారు.

## నిఘా నీడలో ఇంటర్ పరీక్షలు

**- పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు**

కోట, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త : రెండేళ్ల పుస్తకాలతో కుస్తీపడిన ఇంటర్మీడియట్ విద్యార్థులు వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవడానికి సిద్ధమయ్యారు. శనివారం నుంచి మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ విద్యార్థులతో ప్రారంభమవుతున్న పరీక్షల నిర్వహణకు ఇంటర్మీడియట్ బోర్డు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. మార్చి 20వ తేదీ వరకు పరీక్షలు కొనసాగుతాయి. కోట మండలంలో ఎన్‌బికెఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల, అంబేడ్కర్ గురుకుల కళాశాలలో పరీక్షలు నిర్వహించనున్నారు. ఆయా పరీక్షా కేంద్రాల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేశారు. విద్యార్థులు గంటకు ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

## పింఛన్లకు 2 కోట్ల 95 లక్షలు

కోట, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త: మార్చి నెలకు సంబంధించి కోట మండలంలో 6,947 మంది పింఛన్ల లబ్ధిదారులకు రెండు కోట్ల 95 లక్షల రూపాయలు నగదు విడుదలైనట్లు ఇన్‌ఛార్జ్ ఎంపిడిఓ గోపీ తెలిపారు. ఆయన శుక్రవారం ఖప్రభాతవార్త'తో మాట్లాడుతూ పింఛన్‌దారుల సౌలభ్యం నిమిత్తం ఉదయం 7 గంటలకు పింఛన్ల పంపిణీ ప్రక్రియ ప్రారంభించేలా ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసినట్లు తెలిపారు.

## విద్యార్థుల్లో మేధోశక్తిని పెంచేందుకే సైన్స్ ప్రదర్శనలు



వెంకటగిరి, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :విద్యార్థుల్లో మేధాశక్తిని పెంచేందుకు సైన్స్ పరికరాలు ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు నారాయణ విద్యాసంస్థల ఏజీఎం రియాజ్ తెలిపారు. పట్టణంలోని నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సివి రామన్ సైన్స్ ప్రదర్శనను నిర్వహించారు. ముందుగా సివి రామన్ చిత్రపటానికి వచ్చారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సొంతంగా సైన్స్ పరికరాలు తయారు చేసి ప్రదర్శించడం ద్వారా వారిలో మేధాశక్తి పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మహేష్, ఈ కిడ్స్ వైస్ ప్రిన్సిపాల్ వెన్నెల, రాంప్రసాద్, మల్లికార్జున, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రజా దర్బారు

బాలాయపల్లి, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త: స్థానిక స్త్రీ శక్తి భవనంలో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో మార్చి ఒకటో తేదీ ఉదయం ప్రజా దర్బార్ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో డిజె వినీల్ కుమార్ సమస్యలను వినతి పత్రాలు ద్వారా ఎమ్మెల్యే రామకృష్ణకు సమర్పిస్తే పరిష్కరిస్తారని తెలిపారు. ప్రజా దర్బార్‌కు మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

## ఘనంగా రేస్ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం



చిల్లకూరు, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త: చిల్లకూరు మండలం చింతవరం గ్రామంలో ఏర్పాటై ఉన్న రేస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు సంపత్ కుమార్‌రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. పాఠశాలలో విద్యార్థులు ఏర్పాటుచేసిన వివిధ రకాల సైన్స్ ఎగ్జిబిట్లను ముఖ్య అతిథులు, పిల్లల తల్లిదండ్రులు సందర్శించారు. అనంతరం సైన్స్ ఎగ్జిబిషన్లో గెలుపొందిన విద్యార్థులకు ముఖ్య అతిథులైన జిందాల్ పవర్ ప్లాంట్ సపోర్టింగ్ ప్లాండ్ హెడ్ సుల్తాన్ అహ్మద్ మన్సూరి, చింతవరం హెడ్మాస్టర్ శివ సుబ్రహ్మణ్యం, ఆయుర్వేదిక్ డాక్టర్ శేఖర్ చేతుల మీదగా మెమెంటోలు, మెడల్స్‌ను అందజేశారు. కార్యక్రమానంతరం కరస్పాండెంట్ ఎల్లసిరి బాల చెన్నయ్య, చైర్మన్ గుమ్మడి వెంకటసుబ్బయ్యల చేతుల మీదుగా ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గుమ్మడి యమునమ్మ, శ్రీనివాసులు, ప్రభాకర్, కోటయ్య, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



గూడూరు, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త: తిరుపతిలో మార్చి 4, 5 తేదీల్లో నిర్వహించే వీధి వ్యాపారుల సంఘం తిరుపతి జిల్లా 2వ మహాసభలను జయప్రదం చేయాలని వీధి వ్యాపారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ శివ కుమార్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సిహెచ్ ప్రభాకర్ కోరారు. గూడూరు పట్టణంలో మంగళవారం మహాసభల ప్రచార కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ పరిధిలో చిన్న చిన్న వ్యాపారస్తుల నుండి, తోపుడు బండ్ల వ్యాపారుల నుండి అక్రమ గేటు వసూలు చేస్తూ వారిని అనేక ఇబ్బందులు పెడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ గూడూరు నియోజకవర్గ కార్యదర్శి జి శశికుమార్, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి కె.నారాయణ, సిపిఐ చిల్లకూరు మండల కార్యదర్శి జి. రమేష్ వ్యాపారుల సంఘం పట్టణ నాయకులు, వీధి విక్రయ వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

## వరసిద్ధి వినాయక స్వామిచే పట్టు వస్త్రాలు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం వేకువ జామున స్వామి అమ్మవార్ల కళ్యాణం జరగనుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం ఇక్కడి స్వామి అమ్మవార్లకు ఇఓ పెంచలకిషోర్‌ల సారథ్యంలో పట్టు వస్త్రాలను తీసుకొచ్చారు. వారికి ఆలయ సేవా కమిటి నాయకుడు రంగినేని చెంచయ్య నాయుడు, ఇఓ డి.బాపిరెడ్డి ఉప కార్యనిర్వహణాధికారి ఎన్ ఆర్ కృష్ణారెడ్డి ప్రధానార్చకులు సంబంధంగురుక్, కరుణాకర్ గురుకుల్, ఎఇఓ విద్యా సాగర్‌రెడ్డి, లోకేష్‌రెడ్డి, సూపరింటెండెంట్ నాగభూషనం యాదవ్, టటెంపుల్ ఇన్స్ పెక్టర్లు హరియాదవ్, సుదర్శనం నాయుడులు స్వాగతం పలికారు. పట్టు వస్త్రాలను జ్ఞాన ప్రసూనాంబ సదన్ నుంచి దక్షిణ గోపురం కంచుగడప నుంచి అలంకార మండపంలో అందించారు.

## టిటిడిచే స్వామి అమ్మవార్లకు సారె



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలోని వాయులింగేశ్వరుని సన్నిధిలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలల్లో భాగంగా శనివారం వేకువ జామున జరిగే స్వామి అమ్మవార్ల కళ్యాణోత్సవానికి సోమవారం సాయంత్రం టిటిడి తరపున స్వామి వారికి పట్టు వస్త్రాలు అమ్మవారికి సారెను టిటిడి ఇఓ శ్యామలరావు అందించారు. ఇఓ తో పాటు డెప్యూటి ఇఓ లోకనాథం, టిటిడి వేదపండితులు మంగళవాయిద్యాలతో పట్టు వస్త్రాలను అలంకార మండపంలో స్వామి అమ్మవార్లకు అలంకరింప జేయుటకు స్వామి నాదన్ గురుకుల్, రాజేస్,సూరి గురుకుల్స్, పారోహితులు అర్ధగిరిలకు అందించారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వారికి ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు.

## ప్రతి ఒక్కరూ క్రీడల్లో పాల్గొన్నాలి

**- స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మిస్తాం**

**-టిటిడి ఉద్యోగుల క్రీడా పోటీల్లో చైర్మన్ బిఆర్ నాయుడు**



తిరుమల,ఫిబ్రవరి 28ప్రభాతవార్తప్రతినిధి: లక్షలాది మంది భక్తులకు విశేష సేవలందిస్తున్న టిటిడి ఉద్యోగులు పనిఒత్తిడి, మానసిక ఒత్తిడి నియంత్రించడానికి క్రీడలు దోహదపడతాయని టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు అన్నారు. క్రీడలు బహుమతులు,పోటీకోసం కాకుండా ఉత్సాహంగా ఉల్లాసంగా పాల్గొన్నాలన్నారు. తిరుపతి టిటిడి పరిపాలన భవనం మైదానంలో శుక్రవారం ఉద్యోగుల వార్షిక క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. టిటిడి ఈఓ శ్యామలరావు, అదనపు ఈఓ చిరు మామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఈఓ వీరబ్రహ్మం, టిటిడి ఉద్యోగ సంఘాల నాయకులు డాక్టర్ తలారి రవి, డిఎల్ఓ వరప్రసాద్ రావు, విజిఓ సదాలక్ష్మీ, డిప్యూటీ ఈఓలు ఆనందరాజు, దామోదరం, గోవిందరాజన్, దేవేంద్రబాబు, ఉద్యోగులతో కలిసి టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు పావురాలను, బెలూన్‌లను ఎగరవేసి క్రీడలు లాంఛనంగా ప్రారంభించారు. ఉద్యోగుల కోసం స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మించేందుకు చర్యలు చేపడతామన్నారు. ప్రతిరోజు ఉద్యోగులు క్రీడలలో భాగస్వాములు కావాలని దీనిద్వారా క్రమశిక్షణ, మానసిక ఉల్లాసం, శారీరక ధృడత్వం పెరుగుతుందన్నారు. ఈ పోటీల్లో ప్రతిఒక్కరు పాల్గొనాలని, మొదటి స్థానం 2 వేల రూపాయలు, రెండవ స్థానం 1800 రరూపాయలు, మూడోస్థానం 1600 రూపాయల విలువైన బ్యాంక్ గిఫ్ట్ కార్డులు అందజేస్తామన్నారు. అంతకుముందు క్రీడాకారులైన ఉద్యోగుల టీంమలను పరిచయం చేసుకుని వారినుంచి మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. ఉద్యోగులు టగ్ ఆఫ్ వార్ చేపట్టారు.

## రాష్ట్ర పునర్నిర్మాణానికి పునాదిగా బడ్జెట్ : ఎమ్మెల్యే భానుప్రకాశ్



పుత్తూరు, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త : సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం 2025-26 ఆర్ధిక సంవత్సరానికి సంబంధించి అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర పునర్నిర్మాణానికి పునాదిగా నిలుస్తుందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ అన్నారు. మొత్తం రూ. 3,22,359 కోట్లతో రాష్ట్ర గతిని, స్థితిని మార్చే సానుకూల, ప్రగతి శీల బడ్జెట్‌ను ప్రజల ముందుంచామని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర - 2047 విజన్‌లోని 10 సూత్రాల లక్ష్య సాధనకు ఈ బడ్జెట్ వారధి అవుతుందన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా సూపర్ సిక్స్ పథకాల అమలు కోసం బడ్జెట్‌లో సహేతుకంగా కేటాయింపులు జరిపామని తెలిపారు. అత్యధికంగా వ్యవసాయ రంగానికి రూ. 48,341 కోట్లు, తల్లికి వందనం పథకానికి రూ. 9,407 కోట్లు, ఎస్సీల సంక్షేమానికి రూ. 20,218 కోట్లు, విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దే కీలకమైన విద్యా శాఖకు రూ. 34,311 కోట్లు కేటాయించామని వివరించారు. ప్రజలందరి సహకారంతో స్వర్ణాంధ్ర - 2047 విజన్‌ను సాకారం చేసుకునే దిశగా బడ్జెట్ మార్గ నిర్దేశం చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

## రూ.లక్షా 10 వేలకే మోకాళ్ళ మార్పిడి ఆపరేషన్

**-నేటి నుంచి మే 31వ తేది వరకు మాత్రమే**

**-ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సంకల్ప ఆస్పత్రి యాజమాన్యం**




తిరుపతి హెల్త్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త : స్థానిక సంకల్ప ఆస్పత్రి యాజమాన్యం మోకాళ్ళ నొప్పితో బాధపడుతున్న వారికి మోకాళ్ళ మార్పిడి ఆపరేషన్‌ను అతి తక్కువ ఖర్చుతో ఎలాంటి లాభాపేక్ష లేకుండా స్పెషల్ ప్యాకేజీని ప్రారంభించారు. 60 సంవత్సరాలు దాటిన వ్యక్తులలో ఎక్కువగా భరించలేని మోకాళ్ళ నొప్పితో బాధపడుతూ ఉండేవాళ్ళను ఎంతో మందిని చూస్తున్నామన్నారు. వారిలో చాలా మంది మధ్య తరగతి కుటుంబానికి చెందినవారని, మధ్య తరగతి కన్నా దిగువన ఉండేవాళ్ళు వారి ఒక రోజు వారి పనులు కూడా చేసుకోలేక మోకాళ్ళ నొప్పితో ఇబ్బంది పడుతున్న కూడా మోకాళ్ళ ఆపరేషన్ ఖర్చు ఎక్కువ అవుతుందని ఆపరేషన్ చేయించుకోలేక ఇబ్బంది పడుతున్నారు. అలాంటి వారి కోసం ఎలాంటి లాభాపేక్ష లేకుండా తిరుపతిలోని సంకల్ప ఆస్పత్రి వారు మోకాళ్ళ మార్పిడి ఆపరేషన్‌ను ఎంతో అనుభజ్ఞులైన జాయింట్ రిప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ శ్రీకాంత్ వారి యొక్క టీంతో తక్కువ రక్త స్రావంతో నొప్పిలేని శస్త్ర చికిత్స, త్వరగా కోలుకొనుట లాంటి అధునాతన పద్ధతిలో కేవలం రూ. 1లక్షా 10 వేలతో మార్చి 1వ తేది నుంచి 31వ తేది వరకు ఈ అవకాశం అందుబాటులో ఉంటుందని సంకల్ప ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ నాగేశ్వరరావు, మేనేజింగ్ డైరెక్టర్, ప్రముఖ సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ నాగరాజు, ఎమర్జెన్సీ మెడిసిన్ డాక్టర్ అనంతనాగ్ తెలియజేశారు. ఈ ప్యాకేజీని అవసరమైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## శాస్త్ర సాంకేతికతోనే దేశాభివృద్ధి

**-దస్కూల్ కరస్పాండెంట్ జనార్ధన్‌రావు జె.పవార్**



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త : దేశం అభివృద్ధి చెందాలంటే శాస్త్ర సాంకేతిక రంగాలు పురోగతి సాధించాలని ద స్కూల్ కరస్పాండెంట్ జనార్ధన్‌రావు జె.పవార్ అన్నారు. అంతర్జాతీయ సైన్సు దినోత్సవాన్ని పురస్కరించుకుని ద స్కూల్‌లో ఏర్పాటు చేసిన సైన్సు ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజాత్మక శక్తిని వృద్ధి చేయడానికి ఈ సైన్సు ప్రయోగాలు ఉపయోగపడుతాయన్నారు. విద్యార్థులు సుమారు రెండువందల ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. వీటిలో ప్రధానంగా హైడ్రాలిక్ బ్రిడ్జి, వాటర్ ప్యూరిఫైర్, డయాలసిస్ సిస్టమ్, గుండె రక్త ప్రసరణ, డ్రిప్ ఇరిగేషన్, పొల్యూషన్ తదితర అంశాలు తల్లిదండ్రులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో హెచ్ఎం విశాల, ఉపాధ్యాయబృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కెనరా బ్యాంక్‌లో డిజిటల్ మోసాలపై అవగాహన కార్యక్రమం




తిరుపతి విద్య, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త: ఆర్ బీ ఐ ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం కెనరా బ్యాంక్ ప్రధాన కార్యాలయం సూచనలు మేరకు సర్కిల్ కార్యాలయం తిరుపతిలో డిజిటల్ మోసాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా సర్కిల్ ఆఫీస్ హెడ్,జనరల్ మేనేజర్ ఐ.పి. మితాంతయ మొబైల్ వ్యాన్ ప్రారంభోత్సవం కార్యక్రమములో పాల్గొని మాట్లాడుతు ప్రజలు తమ వ్యక్తిగత,బ్యాంకింగ్ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 టోల్ ఫ్రీ నెంబరు డయల్ చేసి సమాచారం అందించాలన్నారు. అదే విధంగా ఇందుకు నిర్దేశించిన వెబ్ సైట్ సందర్శించవచ్చున్నారు. సైబర్ నేరాలపట్ల అందరిలో అవగాహన కలిగించాలనే ఉద్దేశ్యంతో మొదట మొబైల్ వ్యాన్ ని ప్రారంభించి తర్వాత వాకథాన్ నిర్వహించారు.ఈ కార్యక్రంలో డీజీఎం జిఎన్ మూర్తి, రవీంద్ర కుమార్ అగ్రవాల్ సర్కిల్ స్టాఫ్ అందరు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## కార్మికులందరని పర్మినెంట్ చేయాలి : సిఐటియు

గూడూరు, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త: మున్సిపాలిటీలలో పనిచేస్తున్న కాంటాక్ట్, ఔట్ సోర్సింగ్,ఎన్.యం.ఆర్ కార్మికులందరినీ, దశలవారీగా పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కోరుతూ శుక్రవారం రోజు తిరుపతి జిల్లా గూడూరులో ఏ.పీ.మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సి.ఐ.టి.యు) అనుబంధం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన తెలియ జేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.గోపీనాథ్, గౌరవా ధ్యక్షులు జోగి.శివకుమార్, నాయకులు బి. వి.రమణయ్య, అడపాల ప్రసాద్, జిల్లా కమిటీ సభ్యులు ఎన్.వెంకటరమణ, పట్టణ కార్యదర్శి ధారా కోటేశ్వరరావు, రాజేష్, గిరి, సంపూర్ణమ్మ, నారాయణమ్మ, పద్మమ్మ పెంచలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభ కలిగిన విద్యార్థులకు నగదు పురస్కారం

కోట,ఫిబ్రవరి 28 ప్రభాతవార్త: ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు ఎల్లప్పుడు తమ వంతు సహకారం ఉంటుందని విశ్రాంతి ప్రధానోపాధ్యాయులు నెల్లూరు సుబ్రమణ్యం అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలురు ఉన్నత పాఠశాలలో 25వ ఉత్తమ విద్యార్థుల అభినందన ప్రోత్సాహక బహుమతుల ప్రధాన కార్యక్రమం జరిగింది. ఇన్‌చార్జ్ హెచ్ఎం, రమాదేవి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.60 మంది విద్యార్థినీ విద్యార్థులకు నగదు పురస్కారాన్ని అందచేశారు.ఈ కార్యక్రమంలో వల్లీబాష,నాగయయ్య ఆవులు సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

## సృజన... విజ్ఞాన శోధన



కోట,ఫిబ్రవరి 28 ప్రభాతవార్త : శాస్త్ర సాంకేతిక రంగాల్లో అగ్ర దేశాలతో మన దేశం పోటీ పడుతోందని ప్రగతి విద్యా సంస్థల అధినేత పసుపులేటి కిషోర్ అన్నారు. శుక్రవారం జాతీయ సైన్సు దినోత్సవం సందర్భంగా ప్రగతి పాఠశా లలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజన, విజ్ఞానం, వెలికి తీసి ప్రోత్సహి ంచేందుకు అనేక కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతోందన్నారు. విద్యార్థులు తమారు చేసిన అనేక నమోనలు ఏంతోగానో ఆకట్టుకున్నాయి.

## గూండ్లు గ్రామంలో సివిల్ రైట్స్ డే



వాకాడు, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త : వాకాడు మండలం గూండ్లు గిరిజన గ్రామంలోని శుక్రవారం తాసిల్దార్ రామయ్య ఆధ్వర్యంలో సివిల్ రైట్స్ డే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హక్కులు గురించి తెలుసుకోవాలన్నారు, ఈ కార్యక్రమంలో ఈవో పి ఆర్ డి ఉమామహేశ్వరరావు, ఎస్సీ ఎస్టీ సభ్యులు కూరపాటి రవీంద్రబాబు, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కూరపాటి రవీంద్రబాబు, వివిధ శాఖ అధికారులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సైన్స్ పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి

గూడూరు, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త : విద్యార్థులందరూ సైన్స్ పట్ల అవగాహన కలిగి ఉండి చక్కగా చదువుకొని అభివృద్ధి చెందాలని ఐడిబిఐ బ్యాంక్ మేనేజర్ మహేంద్ర రావు తెలియజేశారు.రెండవ పట్టణంలోని వి.ఎస్.ఆర్ పాఠశాలలో నిర్వహించిన జాతీయ సైన్స్ దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటుచేసిన సైన్స్ ఎగ్జిబిషన్ను ఐడిబిఐ బ్యాంక్ మేనేజర్ మహేందర్ రావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి, పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ బాలకృష్ణ రాజు, కరస్పాండెంట్ అన్నపూర్ణ, శాంతి ప్రియ, అరవింద్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యేచే నూతన వధూవరులకు తాళిబొట్లు



శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 28 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతి ఏడాది మాజీ శాసనససభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి నూతన వధూవరులకు బంగారు తాళిబొట్లను అందించే సంప్రదాయం అమలు చేస్తున్నారు. శుక్రవారం శ్రీతలాంబ దేవస్థానంలో ప్రత్యేక పూజలు జరిపి, స్వామి అమ్మవార్లతో పాటు నూతన వధూవరులకు అందించారు. ఆయన శివరాత్రి సందర్భంగా శివమాల ధరించి, ఆయనతో పాటు ఆయన సహచరులకు కూడా శివమాల ధరింపజేసారు. ఈ కార్యక్రమాల్లో బియ్యపు మదుసూధనరెడ్డితో పాటు మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు పగడాల రాజు,మాజీ కౌన్సిలర్ కంతా ఉదయ్‌కుమార్, మాజీ కౌన్సిలర్ ఉత్తరాజి శరవణ కుమార్, మాజీ ధర్మకర్తల మండలి సభ్యులు బుల్లెట్ శ్యాం,గరిక పాటి చంద్ర, కొల్లూరు హరినాయుడు, గణేష్,పెరుమాళ్, యుగంధర్‌రెడ్డి, సురేష్,అట్ల రమేష్, మునికుమార్, నరసింహులు, పాలమంగళం రవి,,జివికె రెడ్డి అంకయ్య, బాను, నాగరాజు, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శనలు



శ్రీకాళహస్తిరూరల్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రాజగోపురం వెనుక స్వర్ణముఖినది ఒడ్డున ఏర్పాటు చేసిన ధూర్జటి కళా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈనేపథ్యంలో దేవస్థానం కూడా స్థానికులకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. శుక్రవారం శ్రీకాళహస్తి పట్టణంలోని శ్రీరాం నగర్ కాలనీకి చెందిన ఎం.ఆర్.ప్రభాకర్, ఎం.ఆర్.దేవిల కుమార్తె ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ధూర్జటి కళాప్రాంగణంలో మేల్‌మురుగన్.మౌనిషా పౌర్ణమి చిత్రంలోని 'భరతవేదముగ', డమరుకం చిత్రంలోని 'శివ శివ శంకర', శివస్తుతిలోని 'శంభో శివశంభో' 'శివ తాండవం' పాటలకు ఎంతో చక్కగా నృత్యం చేయడంతో పలువురు భక్తులను ఆకట్టుకుంది. అనంతరం చిన్నారి మౌనిషాకు ధూర్జటి కళా ప్రాంగణం ఇన్‌ఛార్జి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో మెమొంటోతో పాటు ప్రశంసాపత్రంను అందించి దేవస్థానం కండువాతో సత్కరించారు.

## ముగిసిన కపిలేశ్వరుని ఉత్సవాలు



తిరుపతి,ఫిబ్రవరి 28ప్రభాతవార్త : కపిలేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఉదయం త్రిశూల స్నానంతో ముగిసాయి. ఉదయం 6.30 గంటలకు నటరాజస్వామి సూర్యప్రభ వాహనంపై అన్నారావు కూడలి వరకు వెళ్ళి ఆలయానికి చేరుకున్నారు. 9గంటలకు అర్చకులు శాస్త్రోక్తంగా త్రిశూల స్నానం నిర్వహించారు.

## అమర రాజా విద్యాలయంలో సైన్స్ దినోత్సవం.



రేణిగుంట,ఫిబ్రవరి 28 ప్రభాతవార్త: రేణిగుంట మండలం కరకంబాడి అమర రాజా విద్యాలయం నందు శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించు కొని పలు కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థులకు సైన్స్‌పై పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ నమూనాలు అందరిని ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ గ్లోరీ ప్రియ రామన్ ఎఫెక్ట్ పై తెలియజేశారు. ప్రపంచవ్యాప్తంగా రామన్ భారతదేశ గొప్ప శాస్త్రజ్ఞుడిగా ఖ్యాతి గడిచారని తెలిపారు. క్రమంలో విద్యాలయం బోధన బోధ నేతర సిబ్బంది పాల్గొన్నారు.

## భవిష్యత్తు డ్రోన్లమయం కానుంది



రేణిగుంట ఫిబ్రవరి 28 ప్రభాతవార్త: భవిష్యత్తు డ్రోన్లమయం కానున్నదని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాద మునిరెడ్డి అన్నారు. రేణిగుంట మండలం కరకంబాడి అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో డ్రోన్ల టెక్నాలజీ పై శిక్షణ తరగతులను ఈనెల 25వ తేదీతో ముగిశాయి. ఈ సందర్భంగా శుక్రవారం ఏర్పాటైన సెమినార్లో ముఖ్య అతిథులుగా కోయం బత్తూరుకి చెందిన గ్రీన్ టెక్ ఆవియేషన్ సీఈవో ప్రవీణ్ రాజశేఖర్, చీఫ్ ఇన్స్ట్రక్టర్ నెహ్రూ అనేక విషయాలు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో సిఈసి విభాగం హెచ్ ఓ డి పుష్పలత, దిలీప్ కుమార్ దాదాపు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐఐటి ప్రొఫెసర్ కోటేశ్వరరావు, రమ్యలను, కళాశాల ప్రిన్సిపల్ నాదమున్ రెడ్డి, పి ఆర్ ఓ బాలకృష్ణ సన్మానించారు.